



# వార్తాప్రభ


RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 89 | ది. 7-7-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 89 | Date : 7-7-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |




## ఏ.పి. హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

**అమరావతి,జూలై 6 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో అదనపు న్యాయమూర్తులుగా శ్రీ మతి సునీత గంధం, శ్రీ ఆలపాటి గిరిధర్, శ్రీ పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అలియాస్ శ్రీ సీహెచ్ పురుషోత్తమ కుమార్ గార్లు సోమవారం ప్రమాణం చేశారు.హైకోర్టు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా గౌరవ సునీత గంధం,ఆలపాటి గిరిధర్,పురుషోత్తమ్ కుమార్ చింతలపూడిలచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ గారు ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనియామకాలతో ఏపీ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు చేరింది. ఈకార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు,బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు,న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు,న్యాయశాఖ అధికారులు,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.





# వనరుల సద్వినియోగంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

- హార్టీకల్చర్ సిరులకు లింగాల మండలం కేస్ స్టడీ
- 51.88 చదరపు కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ'
- ప్రైవేట్ భాగస్వామ్యంతో 3 రీజియన్లలో స్పోర్ట్స్ సిటీలు
- 6 నెలల్లో ఏఈఆర్, టీఈఆర్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి
- రెండు నెలల్లో ప్రతీ జిల్లాకు డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ రూపకల్పన
- ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాల తర్వాతే తుది ప్రణాళిక
- విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లపై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి,జూలై 6 (వార్తాప్రభ) :** ఉద్యానవన పంటల సాగుతో తలసరి ఆదాయంలో సరికొత్త రికార్డ్ సృష్టించిన కడప జిల్లా లింగాలం మండలం స్ఫూర్తితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్ పురోగతికి హార్టికల్చర్ గ్రోత్ ఇంజిన్ అవుతుందని...25కు పైగా ఉద్యాన ఉత్పత్తులు సాధించేలా చూడాలన్నారు. ఈ ప్రాంత స్థితిగతులు మార్చే శక్తి హార్టికల్చర్‌కు ఉందని...తిరుపతి ఎకనామిక్ రీజియన్ మాస్టర్ ప్లాన్‌లో రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. పూర్వోదయ పథకం కింద రూ.40,000 కోట్లు, ప్రైవేట్ పెట్టుబడుల రూపంలో వచ్చే మరో రూ.60,000 కోట్లు ఉద్యానవన రంగానికి ఊతమిస్తాయని అధికారులకు సీఎం చెప్పారు. పారిశ్రామికంగా అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల కన్నా...సీమలోని ఓ మండలంలో ప్రజల తలసరి ఆదాయం అధికంగా ఉండటాన్ని అధ్యయనం చేయాలని సీఎం అన్నారు. కడప జిల్లా లింగాల మండలంలో ప్రజలు రూ. 7.30 లక్షలు తలసరి ఆదాయం కలిగి ఉండడం హార్టికల్చర్ పంటల సాగు వల్ల కలిగే లాభాలకు నిదర్శనమని సీఎం స్పష్టం చేశారు. హార్టికల్చర్ కు అత్యంత అనువైన రాయలసీమలో ఆ దిశగా ప్రజలను మరింత ప్రోత్సహించాలన్నారు. సీమలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను తీసుకువస్తే అక్కడ ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా మారుతాయని సీఎం అన్నారు. ఆ దిశగా జిల్లా అధికారుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రుల వరకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. సచివాలయంలో సోమవారం రాష్ట్రంలోని మూడు ఎకనామిక్ రీజియన్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణపై పలు మార్గదర్శకాలను సూచించారు. ఇప్పటికే విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రణాళిక ఆవిష్కరించగా...6 నెలల్లో అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సిద్ధమయ్యాక ముసాయిదాను ప్రజలు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. రెండు నెలల్లో డిస్ట్రిక్ట్ ఎకనమిక్ ప్రొఫైల్ ను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏ రంగాల్లో తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీలు..** అమరావతి, తిరుపతి, విశాఖలో అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో మూడు ప్రాంతాల్లోనూ స్పోర్ట్స్ సిటీల అభివృద్ధి జరగాలన్నారు. ఏపీకి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతంలో సూర్య లంక సహా వివిధ ప్రాంతాల్లోని బీచ్ ఫ్రంట్ లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సూర్య లంక బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సీఎం నిర్దేశించారు. తీరప్రాంత పర్యాటకం, గ్లోబల్ బిజినెస్-ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్, గ్లోబల్ టాలెంట్-ఎలైట్ లివింగ్ అనే 3 పిల్లర్లపై 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లోని 51.88 చదరపు కి.మీ. విస్తీర్ణంలో 'వైజాగ్ బే సిటీ' అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేలా ప్రముఖ సంస్థల్ని ఆహ్వానించాలన్నారు. బే సిటీలో 3,291 ఎకరాల ప్రభుత్వ భూమి లభ్యత ఉందని గుర్తించినట్టు ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే విశాఖ ఎకనామిక్ రీజియన్లో ఇప్పటికి మొత్తం 49 ప్రాజెక్టులు రాగా...వీటిలో 18 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని, మరో 12 త్వరలో గ్రౌండ్ కానున్నాయని అధికారులు వివరించారు. మరో 19 ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయని చెప్పారు.

## త్వరలో 'నేతన్న భరోసా' పథకం అమలు : మంత్రి సవిత

- చేనేత సంఘాలకు రూ.6.50 కోట్ల బకాయిల చెల్లింపు
- మంగళగిరిలో ఘనంగా ఆప్కో స్వర్ణోత్సవ వేడుకలు



**మంగళగిరి,జూలై 6 (వార్తాప్రభ) :** త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే పూర్తయిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సహకార సంఘం (ఆప్కో) స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం మంగళగిరిలోని ఆప్కో తోటలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత నేతన్నలకు పలు శుభవార్తలు ప్రకటించారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.6.50 కోట్ల బకాయిలను రెండు విడతల్లో విడుదల చేస్తామని మంత్రి తెలిపారు. ఈ నెల 15న సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేసిన వస్త్రాలకు సంబంధించిన రూ.4 కోట్లు, ఆగస్టు మొదటి వారంలో సాధారణ చేనేత ఉత్పత్తులకు సంబంధించిన రూ.2.50 కోట్లు చెల్లిస్తామని చెప్పారు. నేతన్నల పెట్టుబడి భారం తగ్గించేందుకు ఆప్కో ద్వారా నూలు సరఫరా చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. చేనేత కార్మికులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆప్కోను పూర్వ వైభవంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిందని మంత్రి తెలిపారు. డిజిటలైజేషన్, కంప్యూటరైజ్డ్ బిల్లింగ్, ఆధునిక నిల్వ నిర్వహణ వంటి చర్యలతో ఆప్కోకు స్కోచ్ అవార్డు--2025 లభించిందన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రెడీమేడ్ చేనేత వస్త్రాల తయారీకి నేతన్నలకు శిక్షణ ఇస్తున్నామని, డైయింగ్, బ్లీచింగ్, నేత ఛార్జీలను కూడా పెంచామని చెప్పారు.తిరుమల తిరుపతి దేవస్థానంతో (టీటీడీ) ఆప్కో తొలిసారిగా ఒప్పందం కుదుర్చుకుందని మంత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న చేనేత సహకార సంఘాలకు టీటీడీకి అవసరమైన దుశ్శాలువాలు, చీరలు, జాకెట్లు, కండువాల సరఫరా ఆర్డర్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

# పరిష్కారం పలకరిస్తే సంతోషం పరవళ్లు!

- అర్జీదారుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయండి
- పీజీఆర్ఎస్ సంతృప్తి స్థాయిలో జిల్లాను ముందంజలో నిలపండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,జూలై 6 (వార్తాప్రభ) :** ప్రజల సమస్యకు అధికారులు పరిష్కారం చూపినప్పుడు వారి ముఖంలో ఆనందం మన కృషికి దక్కిన ఫలితమని.. ప్రజా స్నేహ పూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చే అర్జీలకు గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపేందుకు అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రారంభానికి ముందు శాఖల వారీగా వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారంపై కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం ఆశలు ఉంటాయన్న విషయాన్ని గుర్తించి.. అర్జీలను కేవలం విధి నిర్వహణలో భాగంగా కాకుండా, బాధ్యతగా స్వీకరించి సత్వరమే పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి అధికారుల పనితీరుకు నిజమైన గుర్తింపు అని పేర్కొన్నారు. అర్జీదారులతో సరైన విధంగా మాట్లాడటం ముఖ్యమని, వారికి సమస్య పరిష్కార ప్రక్రియను స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంపై గౌరవ ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారని.. సమస్య పరిష్కారంపట్ల నిబద్ధత చూపే అధికారులకు సీఎంవో నుంచి ప్రశంసలు కూడా లభిస్తున్నాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

**మొత్తం 240 అర్జీలు:** కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 240 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూకు సంబంధించి 74, పోలీసు శాఖకు సంబంధించి 41, పురపాలక పట్టణాభివృద్ధికి సంబంధించి 23 అర్జీలు ఉన్నాయి. ఈ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


**మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో**

O.S.No : 2449/2023

Between:
Bank of Baroda
Eluru Road Branch,
Rep by its Branch Manager
Governorpeta,
Vijayawada-520002
--------Plaintiff

And

Chilaka Lavanya Kumar
S/o Dasu, R/o D.No.48-18/5-5, Nagarjuna Nagar,
Main Road-2
Near Government Hospital
Vijayawada-520008
--------Defendant

పై నెంబరు దావా వాది బ్యాంకు వారు మీపై రు.3,82,217-74 ల్కు మరియు ఖర్చులు వగైరాలు రాబట్టు కొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు యెట్టి అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోనే నిమిత్తము ది.11-08-2026వ తేది ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని లేక న్యాయవాది గారి ద్వారా హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
**డాక్టర్ దారా సత్యనారాయణ**
వాది బ్యాంకు తరపున న్యాయవాది
కిలారుబుచ్చిబాబు రోడ్డు,
మొగల్‌రాజుపురం,
విజయవాడ - 520010
సెల్ నెం : 9440320435

విజయవాడ
30-06-2026


# ముందే లీకైన ఆకస్మిక తనిఖీ

- అధికారులు వస్తున్నారనే సమాచారంతో అప్రమత్తమైన యంత్రాంగం!"
- మర్రిపాడులో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి పర్యటన
- రేషన్ షాపు, పాఠశాల, హాస్టల్‌లో తనిఖీలు
- ముందస్తు సమాచారం వల్ల లోపాలు కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందని గ్రామస్థుల ఆరోపణ.



**మర్రిపాడు,జూలై 6 (వార్తాప్రభ) :** మర్రిపాడు మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి గురువారం ఆకస్మికంగా పర్యటించి రేషన్ దుకాణాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హాస్టల్‌ను పరిశీలించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు విద్యార్థులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆయన క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. రేషన్ షాపులో బియ్యం ఇతర నిత్యావసర వస్తు వుల పంపిణీ కొలతలపై లబ్ధిదారులను నేరుగా ప్రశ్నించి వివరాలు సేకరించారు. సరుకులు నాణ్యతగా అందుతున్నాయా ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు వంటగది పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి మెనూ ప్రకారం గుడ్లు చికెన్ ఇతర పోషకాహారం అందుతున్నాయా భోజనం నాణ్యత ఎలా ఉందో తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రజలకు విద్యార్థులకు నాణ్యమైన సేవలు అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చైర్మన్ ఆదేశించారు.ముందస్తు సమాచారం ఆకస్మిక తనిఖీ ఉద్దేశానికే భంగమా? అయితే రాష్ట్ర స్థాయి అధికారి వస్తున్నారనే సమాచారం ముందుగానే సంబంధిత శాఖలకు చేరడంతో రేషన్ డీలర్లు హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు అప్రమత్తమయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.తనిఖీలకు ముందు ఏర్పాట్లు చేసి ఉన్న లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆకస్మిక తనిఖీల అసలు ఉద్దేశం వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడమే నని కానీ ముందుగానే సమాచారం లీక్ కావడం వల్ల వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం తగ్గిపోతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామస్థుల అభిప్రాయం..** రాష్ట్ర స్థాయి అధికారులు పర్యటించే విషయాన్ని ముందుగానే సంబంధిత శాఖలకు తెలియజేయకుండా నిజమైన పరిస్థితులను పరిశీలించే విధంగా తనిఖీలు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాంటి విధానంతోనే ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న లోపాలు వెలుగులోకి వచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## రెండేళ్లలో రూ.270 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి - ఎమ్మెల్యే బోడే ప్రసాద్




**పెనమలూరు,జూలై 6 (వార్తాప్రభ) :** పెనమలూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సుమారు రూ.270 కోట్లతో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ తెలిపారు,గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. పెనమ లూరు నియోజకవర్గం,తాడిగడప మున్సిపాలిటీ,పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గత రెండేళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మీడియా సమావేశం నిర్వహించారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు,2014--2019 మధ్య కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరిగిందని,అయితే 2019--2024 మధ్య వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు... దళిత ప్రాంతాల అభివృద్ధికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధులు సక్రమంగా వినియోగించలేదని,సిద్ధార్థ కళాశాల వంతెన, యనమలకుదురు వంతెన,కుందేరు వంతెన వంటి 90 శాతం పూర్తయిన పనులను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేక పోయిందన్నారు,దీంతో ప్రజలు ఐదేళ్ల పాటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిద్ధార్థ వంతెన,యనమలకుదురు వంతెనలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు,యనమలకుదురు వంతెన లేక ప్రతిరోజూ సుమారు 50 వేల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని చెప్పారు. అలాగే నియోజకవర్గంలో ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.21 కోట్ల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు,ప్రతి నెల మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద సుమారు రూ.16 కోట్లను అవ్వాతాతలకు అందిస్తున్నామని వెల్లడించారు. రూ.7 కోట్ల వ్యయంతో కుందేరు వంతెన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, ఇందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం తాజాగా మంజూరు చేసిందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించి తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జనసేన నాయకుడు తాతపూడి గణేష్ మాట్లాడుతూ,గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతికే ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు,గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ ప్రజలకు అందుబాటులో లేకపోయిందని,కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల సీఎంఆర్ఎఫ్ సాయం అందించామని తెలిపారు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు నిరాధార విమర్శలు చేస్తున్నారని,ప్రజలు మరోసారి కూటమికే మద్దతు ఇస్తారని,వచ్చే ఎన్నికల్లో వైసీపీ మరింత ఘోర పరాజయాన్ని చవిచూడడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు,పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించిన టిడిపి పెద్దలు



**విస్సన్నపేట,జూలై 6 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తెల్లదేవర పల్లి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు వేగి హరి ప్రసాద్ సతీమణి కృష్ణకుమారి శివ ఐక్యం చెందటంతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్రి ), మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావులు ఆమె పార్థివ దేహానికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వేగిరాజా రాయలచేజు తదితరులు పాల్గొన్నారు.

# డిఐఈవో గా బాధ్యతలు స్వీకరించిన జ్యోతుల రాంబాబు..



**కాకినాడ సిటీ,జూలై 6 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా పి ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు పవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిఐఈఓ గా పనిచేసిన కేశవరావు పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో రాంబాబు పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డిఐఈఓ ను కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందం అభినందించారు.

# ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 234 కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు



**హనుమాన్ జంక్షన్,జూలై 6 (వార్తాప్రభ) :** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలోని అన్ని పశు వైద్యశాలల్లో సోమవారం ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 234 కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేసినట్లు బాపులపాడు పశువైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ ఎం. ప్రమీలారాణి తెలిపారు. రేబిస్ వ్యాధి మనుషులు, జంతువులకు ప్రాణాంతకమైందని, దీనిని నివారించేందుకు ప్రతి సంవత్సరం పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని ఆమె సూచించారు. జూనోటిక్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, పశువుల ఆరోగ్య పరిరక్షణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

# పెనుగంచిప్రోలు నూతన ఎస్సై -2 గా సామినేని



**పెనుగంచిప్రోలు,జూలై 6 (వార్తాప్రభ) :** పెనుగంచిపోలు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై 2 గా సామినేని నాగేశ్వరరావు ఆదివారం పదవీ బాధ్య తలు చేపట్టారు. గతంలో ఈయన ఇదే పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టే బుల్ గా, ఏ ఎస్ ఐ గా బాధ్యతలు నిర్వహించి ప్రజల మన్ననలు పొం దారు. ఇటీవలే ఎస్సైగా పదోన్నతి పొంది శిక్షణ పూర్తి చేసుకొని ఇదే పోలీస్ స్టేషన్కు ఎస్ ఐ -2 గా బాధ్యతలు స్వీకరించడం పట్ల సామినేని నాగేశ్వరరావు కు మండల ప్రజలు అభినందనలు తెలిపారు.....

# అంగనవాడి వర్కర్స్ నిరసన




**తిరువూరు,జూలై 6 (వార్తాప్రభ) :** తిరువూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన అంగన్వాడీలకు ఎస్ఐఆర్ విధులు తొలగించాలని డిమాండ్. ఐసిడియస్ విధులతో పాటు ఎస్ఐఆర్ పని భారంమోయలేమంటున్నఅంగన్వాడీలుప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన సంఘం నేతలు..

## దేశ మాజీ ఉప ప్రధాని, దళితుల ఆశాజ్యోతి బాబు జగజీవన్ రావు వర్ధంతి ఘన నివాళి



**తిరువూరు,జూలై 6 (వార్తాప్రభ) :** బాబు జగజీవన్ రావు తన జీవితమంతా పేదల, దళితుల, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంకితం చేశారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి యువతరానికి ఆదర్శం. ఆయన చూపిన బాటలో నడుస్తూ సమాజ సేవ చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి" అని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి యువతరం ముందుకు నడవాలి దేశ సేవ అంకితం అవ్వాలి దేశ ప్రగతికి పునాదుల వేద్దాం జయ కృష్ణ హాస్పిటల్ అధినేత ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరావు ఎండి జనరల్ ఫిజీషియన్ తిరువూరు

# ఘనంగా సూదాబత్తుల రామారావు పదవీ విరమణ సన్మాన సభ...

## ఘనంగా వీడ్కోలు పలికిన సహోద్యోగులు




**పెడన,జూలై 6 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా పశుసంవర్ధక శాఖలో సుధా బత్తుల వన వెంకట రామారావు 46 సంవత్సరాలుగా వివిధ హోదాల లో ఉద్యోగ విధులు నిర్వహించి జూన్ 30వ తారీకున పదవీ విరమణ చేసారు.వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ గా లక్ష్మీపురం చల్లపల్లి మండలం మచిలీపట్నం డివిజన్ నందు ఆయన ఉద్యోగ విరమణ జరిగింది. ఈ సందర్భంగా పెడన పాలెం లోని జె కన్వెన్షన్ హాల్ లో ఆత్మీయ సన్మాన సభ జరిగింది.ఈ సభకు ముఖ్య అతిథులుగా విశ్రాంత ఏ డి డాక్టర్ వీరంకి మధుసూదనరావు ఇతర అసిస్టెంట్ డైరెక్టర్లు వెంకటేశ్వరావు వీరంకి మధుబాబు రవీంద్రరావు ఉమ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు (బుల్లయ్య) వైసీపీ ఇంచార్జ్ పేర్ని కిట్టు అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో రామారావు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమం లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాము తోట వరప్రసాద్ కార్యవర్గ సభ్యులు డిప్యూటీ డైరెక్టర్ అసిస్టెంట్ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ వారితోపాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించిన తోటి ఉద్యోగస్తులు వెటర్నరీ లైవ్ స్టాక్ అసోసియేషన్ వారు రామారావు కుటుంబ సభ్యులు బంధువులు మిత్రులు పాల్గొన్నారు.

# బాబు జగజీవన్ రామ్ (బాబూజీ) కు ఘన నివాళులు





**విస్సన్నపేట,జూలై 6 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కొండ పర్వ, విస్సన్నపేట మండల కేంద్రంలో భారతదేశ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు, దళిత ఐకాన్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలో బహుజన దళిత ఐక్యవేదిక సభ్యులు, కొండ పర్వ గ్రామపంచాయతీ పరిధిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ పి పాపారావు, ప్రవీణ్ , వైసిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎస్ మంగయ్య, తదితరులు పాల్గొన్నారు. మహాత్మ గాంధీజీ ఆదర్శాలతో సత్యాగ్రహ ఉద్యమం లో పాల్గొని 1940, 1942 సంవత్సరంలో దేశ ప్రజల కొరకు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని బ్రిటీష్ ఇనుప సంకెళ్ళకు ఎదురెల్లి పోరాడిన వ్యక్తి బాబు జగజీవన్ రామ్ అని చెప్పారు. 1935లో అఖిల భారత అణగారిన వర్గాల సంఘం ఏఐడీసీఎల్ ను స్థాపించడం జరిగింది. సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యుడిగా ఉండి ప్రపంచ రికార్డు సాధించారని భారతదేశంలోనే సుదీర్ఘకాలం 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా పనిచేరని ప్రధాన మంత్రులుగా దేశానికి సేవలందించిన జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ప్రభుత్వాలలో కార్మిక, రైల్వే, వ్యవసాయ, రక్షణ, కమ్యూనికేషన్స్ మంత్రులుగా విశేషమైన సేవలందించారన్నారు అని వారు తెలియజేశారు. 1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రి 1977-1979 మధ్య భారత ఉప ప్రధాన మంత్రి గా పని చేశారన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేయడంతో పాటు వ్యవసాయ రంగంలో హరిత విప్లవానికి, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కు కూడా దోహదపడ్డారన్నారు. ఢిల్లీలో ఆయన స్మారక స్థలం పేరు సమతా స్థల్ సమానత్వ ప్రదేశం గా నామకరణం చేశారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5న ఆయన జయంతిని దేశవ్యాప్తంగా జరుపుకుంటారని ఆయనను సామాజిక న్యాయానికి చాంపియన్ గా కూడా అభిమానించడం జరుగుతుందని చెప్పారు. దళిత ఐక్యవేదిక అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు కొండా రాజకుమార్ సభ్యులు పాల్గొన్నారు.

# కాశీలో ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాల దర్శనంతో పరవశించిన జైనగర్ జిల్లా విహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు పద్మావతి



**వారణాసి,జూలై 6 (వార్తాప్రభ) :** పవిత్ర కాశీ క్షేత్రంలో జైనగర్ జిల్లా విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి.) ఉపాధ్యక్షురాలు పద్మావతి సోమవారం ఆధ్యాత్మిక యాత్రను అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగించారు. ఉదయం వేళ కాశీ మహిమాన్విత పుణ్యక్షేత్రాలలోని కాలభైరవ స్వామి ఆలయం, మహా మృత్యుంజయ మహాదేవా లయం, అలాగే విశిష్ట ప్రాధాన్యం కలిగిన ధన్వంతరి బావిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించి దేశ ప్రజల సుఖశాంతులు, సనాతన ధర్మ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం పవిత్ర గంగానదిలో స్నానమాచరించి గంగామాతకు ప్రత్యేక ప్రార్థనలు సమర్పించారు. గంగాస్నానం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత, అంతరంగ పవిత్రత కలుగుతుందనే విశ్వాసంతో భక్తిపూర్వకంగా పుణ్యస్నానం నిర్వహించారు. సాయంత్రం గంగాతీరంలో జరిగిన వైభవోపేత గంగా హారతి కార్యక్రమాన్ని తిలకించారు. వేదమంత్రాల నడుమ దీపారాధనలతో, గంటానాదాలు, శంఖధ్వనులతో, భక్తిగీతాల మధ్య సాగిన గంగా హారతి ఆమెను ఆధ్యాత్మిక అనుభూతిలో ముంచెత్తింది. వేలాది మంది భక్తులతో కలిసి గంగామాతకు హారతి సమర్పి స్తూ దివ్యమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా జైనగర్ జిల్లా విహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ, కాశీ విశ్వనాథుని క్షేత్రం, కాలభైరవ స్వామి, మహా మృత్యుంజయేశ్వరుని దర్శనం జీవితంలో మరపురాని అనుభూతిని కలిగించాయని తెలిపారు. పవిత్ర గంగాస్నానం, గంగా హారతి దర్శనం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను ప్రసాదించాయని, ప్రతి హిందువు జీవితంలో కనీసం ఒక్కసారైనా కాశీ యాత్ర చేయాలని ఆకాంక్షించారు. ఈ పుణ్యయాత్ర తనలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత పెంపొందించిందని పేర్కొంటూ, దేశంలో ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాశీ యాత్ర ద్వారా పొందిన దైవానుభూతి జీవితాంతం స్ఫూర్తినిస్తుందని ఆమె పేర్కొన్నారు.

# కుక్కలకు రెబీస్ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలి




**నూజివీడు,జూలై 6 (వార్తాప్రభ) :** కుక్క కరవడం వల్ల రేబీస్ వ్యాధి రాకుండా పెంపుడు కుక్కకన్నింటికీ రెబీస్ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలని నూజివీడు నియోజక వర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాస రావు సూచించారు. సోమవారం ఉదయం చాట్రాయి మండలం, చనుబంద గ్రామంలో ప్రపంచ "జురోసిస్"దినోత్సవం సందర్భంగా చనుబండ పశు వైద్యశాల వద్ద పెంపుడు కుక్కలకు ఎల్ ఎస్ ఏ పవన కుమారి రెబీస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోరంపూడి శ్రీనివాస రావు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను "జూరోసిస్"అంటారని, జంతువుల నుంచి, పక్షుల నుంచి అంటువ్యాధులు మనుషులకు సంక్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు . కుక్క, పిల్లి వంటివి కరిస్తే రేబీస్ వ్యాధి వస్తుందని, పశువుల ద్వారా "బ్రూసెల్లోసిస్"వ్యాధి, ఎలుకల మూత్రం ద్వారా కలుషితమైన నీటితో "లెప్టోస్పిరోసిస్"వ్యాధి, పక్షుల ద్వారా "ఏవియన్ ఇన్ఫ్లుఎంజా"వ్యాధి వస్తుందని,కావున మనుషులు ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండడానికి తగిన వ్యాక్సిన్స్ వేయించుకోవాలని మోరంపూడి చెప్పారు. వీటి మీద అవగాహనకోసమే "ప్రపంచ జూరోసిస్ దినోత్సవాన్ని" జరుపుతున్నారని మోరంపూడి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు నెక్కళపు వెంకటేశ్వర రావు, బీజేపీ సీనియర్ నేత కొత్తగుండ్ల రమేష్, ఫిరంగి పుల్లయ్య, నాయుడు రాంబాబు, ఎల్ ఎస్ ఏ పవన కుమారి, గోపాల మిత్ర విస్సంపల్లి వెంకటేశ్వర రావు, ఏ హెచ్ ఏ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# చాగలనాడు పంట కాలువ సమస్యకు పరిష్కారం : జిల్లా కలెక్టర్





**కాకినాడ,జూలై 6 (వార్తాప్రభ) :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానమైన ఎత్తిపోతల పథకంగా పేరు పొందిన చాగల నాడు ఎత్తిపోతల పథకం పంట కాలువను గండేపల్లి మండలం నాయికంపల్లి రంగంపేట మండలం పెదరాయవరం గ్రామాల మధ్య 500 మీటర్ల పొడవున అక్రమార్కులు పూడ్చి వేసి పంట భూమిగా మార్చి వేశారు ఈ సమస్య వల్ల గత మూడేళ్లుగా ఆ రెండు మండలాలకు చెందిన ఆరు గ్రామాల్లో 5 వేల ఎకరాలకు నీరు అందడం లేదు ఈ ఏడాది సార్వా పంటకైన ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మెట్ట ప్రాంత ఎత్తిపోతల పథకాల రైతు నాయకుడు పుట్టా సోమన్న చౌదరి ఈరోజు కాకినాడలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ కు వినతి పత్రము ఇచ్చి సమస్యను వివరించారు దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ అందుబాటులో ఉన్న జల వనరుల శాఖ అధికారులను పిలిచి ధవలేశ్వరం జల వనరుల శాఖ ఎస్ఈ పెద్దాపురం ఆర్డీవో లను సమన్వయపరిచి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు ఇటీవల కాకినాడలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు సమావేశంలో చాగలనాడు పంట కాలవ సమస్యను పలువురు ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాన్ని సోమన్న చౌదరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు అదే విధంగా పూడిసిన పంట కాలువ బాగు చేతకు ప్రభుత్వం ఏడు లక్షల రూపాయలు కేటాయించిన విషయాన్ని కూడా సోమన్న చౌదరి జిల్లా కలెక్టర్ కు వివరించి నిధుల మంజూరు పత్రాన్ని చూపించారు దీనికి త్వరలో ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు కదా ఈ సమస్యకు సంబంధించి గత కలెక్టర్లు కృతిక శుక్ల షాన్మోహన్ లకు కూడా సోమన్న సమస్యల పరిష్కార వేదికలో అనేకసార్లు దరఖాస్తులు ఇవ్వటం గమనార్హం.

# కానూరు పిఎసిఎస్ లో రైతులకు అవగాహన



**పెడన,జూలై 6 (వార్తాప్రభ) :** కానూరు శ్రీ వెంకటేశ్వర పిఏసిఎస్ లో సోమవారంబోర్డు మీటింగ్ జరిగింది.రైతులకు ఎరువుల పై అవగాహన సదస్సు నిర్వహించటం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ హాజరయ్యారు రసాయన ఎరువుల వాడకం తగ్గించటం మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు ప్రేమవర్మ్ ఫర్ ఫర్టిలైజర్ సెల్ యాప్ ద్వారా ఎరువులు వివిధంగా కొనుగోలు చేయాలి అనే విషయాన్ని వివరించడం జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ రైతులకు ఎరువుల కార్డ్స్ పంపిణీ చేయడం జరిగింది.సొసైటీ ప్రెసిడెంట్ గారైన గోపు ప్రతాప్ నరేష్ కుమార్ డైరెక్టర్స్ అయిన దివి మహేష్, చెక్కా నాగరాజు సొసైటీ సెక్రెటరీ అడపా శ్రీనివాసరావు వి ఎ ఎ కె స్వామి పాల్గొన్నారు గణపతుల చూడమని రావు గణపతుల తాతయ్య బొలిశెట్టి నాని ఇతర రైతులు ఈ కార్యక్రమానికి హాజరుకావడం జరిగింది.

# సోమన్న "శతమానం భవతి" వందో (100)పుస్తకావిష్కరణ





**కర్నూలు, జూలై 6 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న నూరవ (100 )పుస్తకం "శతమానం భవతి " మరియు నూట ఒకటవ (101)పుస్తకం "చెంగల్వ పూదండ పుస్తకావిష్కరణలు జూలై 5,2026న శారదా లైవ్ స్టూడియో, హిమాయత్ నగర్,హైదరాబాద్ లో ఘనంగా జరిగాయి.సంగీత సాహిత్య సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ రెండు పుస్తకాల్ని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్,ప్రొఫెసర్ కొలకలూరి మధు జ్యోతి,డా. వి. డి. రాజగోపాల్, కళాపోషకులు, విశ్రాంత అటవీ శాఖ అధికారి ఏ. ఎల్. కృష్ణారెడ్డి, డా. వి. డి. రాజగోపాల్, బిక్కి కృష్ణ మరియు రిటైర్డ్ ఐ. ఆర్. యస్. జెల్ది విద్యాధర్ ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈ సంస్థ బాలసాహిత్యంలో వీరి విశేష కృషికి గాను "బాల గేయ బ్రహ్మ" బిరుదుతో తగురీతిగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత కవులు పోలయ్య,ప్రధానోధ్యాయులు ఆరెకటిక నాగేశ్వరావు, నాగేశ్వరయ్య పాల్గొన్నారు. శతాధిక గ్రంథకర్త, అవార్డు గ్రహీత గద్వాల సోమన్న ను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులందరూ అభినందించారు.

# విద్యార్థినుల విద్యాభ్యాసానికి దాతృత్వం.. రూ.12 వేల ఆర్థిక సహాయం



**హనుమాన్ జంక్షన్,జూలై 6 (వార్తాప్రభ) :** విద్యకు చేయూతనందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. హనుమాన్ జంక్షన్ సాగర్ స్టూడియో అధినేత రంగారావు కుమారుడు రాజ్ కుమార్. రాజమహేంద్రవరంలోని బొమ్మూరు శాఖ శ్రీ చైతన్య పాఠశాలలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థిని నెడునూరి లిథిక సాయి తేజశ్రీ విద్యాభ్యాసం కొనసాగేందుకు రూ.7,000 ఆర్థిక సహాయాన్ని పాఠశాల ద్వారా నేరుగా అందజేశారు. అదేవిధంగా, ఏలూరులోని సి.ఆర్. రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న మరో విద్యార్థినికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మొత్తం రూ.12,000 విలువైన ఈ సహాయం ఇద్దరు విద్యార్థినుల విద్యాభ్యాసానికి తోడ్పాటుగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డి. మధుసూదన్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం అందించిన ఈ సహాయం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వాలతో పాటు సమాజంలోని దాతలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే ప్రతి చిన్నారి విద్యా హక్కు నిజమైన అర్థంలో సాకారమవుతుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలిచి, మరింత మంది విద్యాదాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు.

# ఘన నివాళులర్పించిన టిడిపి పెద్దలు



**విసన్నపేట,జూలై 6 (వార్తాప్రభ) :** స్థానిక మండల టిడిపి కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధులు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఏఎంసి వైస్ చైర్మన్ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కుక్కడపు వెంకట నాగేశ్వరరావు పలు గ్రామాల సీనియర్ టిడిపి నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు పాల్గొన్నారు

# చెరువులను తలపిస్తున్న రోడ్లు

## పేరుకే కార్పొరేషన్ అంతా డొల్లా





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, కొత్తగూడెం కార్పొరేషన్ లో విలీనమైన సుజాతనగర్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండుకుని, చెరువులను తలపిస్తున్నాయి. సుజాతనగర్ కార్పొరేషన్ ఆఫీస్ నుంచి వేపలగడ్డ వెళ్లే మట్టి రోడ్డు రామాలయం వరకు ముత్యాలమ్మ గుడి నుండి వేపలగట్ట గురుకుల పాఠశాల వరకు రోడ్లు గుంతల్లో నిలిచిన వర్షపు నీరు నిలిచివాహనదారులకు ఇక్కట్లు పడుతున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండుకుని, చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. గత కొన్నేళ్ల నుంచి రోడ్లు గంతలతోనే దర్శనమిస్తోంది. చిన్నపాటి వర్షాని కి నీరంతా చేరి, ఈ రోడ్లలో ప్రయాణం చేయాలంటే నరకం అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాళ్లలోతు నీరు నిలువ ఉంటోందని వాపోతున్నారు. దీంతో ఈ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలబారిన పడుతున్నారు నగరపాలక అధికారులు కనీసం రోడ్ల పరిస్థితిపై దృష్టిసారించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొత్త రోడ్డు ఎలాగో వేయరు... క నీసం పాడైన రోడ్లకు మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్న ప్రజలు

# 19 18 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన.

## పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,జూలై 6 (వార్తాప్రభ):** ఉమ్మడి శేరిలింగంపల్లి డివిజన్‌లో రూ. 19.18 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు,బాక్స్ డ్రైన్లు, వర్షపు నీటి కాలువలు, ఆర్‌సీసీ పైప్‌లైన్,పార్కు అభివృద్ధి తదితర పనులకు పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సోమవారం శంకుస్థాపన చేశారు.బాపునగర్, గోపినగర్, రాజీవ్ గృహకల్ప, మస్జిద్‌బండ, కేఎంఆర్ ఎస్టేట్స్, హెచ్ఏఎల్ కాలనీ, శ్రీ మారుతి కాలనీ, సెంట్రల్ పార్క్ ఫేజ్–2, శిల్ప గార్డెన్స్, కామెలోట్ కాలనీ, టీజీహెచ్‌బీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బాక్స్ డ్రైన్లు, ఆర్‌సీసీ పైప్‌లైన్, పార్కు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,డివిజన్‌లో సీసీ రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ పనులు చేపడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో బురద, నీటి నిల్వలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్య క్రమంలో పనులు చేపడుతున్నామన్నారు.నాణ్యతలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ కోఆపరేటివ్ చైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయం చేసుకుని ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

## - మున్సిపల్ కమిషనర్ ఆదేశం





**శేరిలింగంపల్లి,జూలై 6 (వార్తాప్రభ):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 52 ఫిర్యాదులు అందాయి.కమిషనర్ శాఖాధిపతులతో కలిసి వినతులను పరిశీలించి, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అందిన ఫిర్యాదుల్లో టౌన్ ప్లానింగ్ శాఖకు అత్యధికంగా 42, ఇంజినీరింగ్ శాఖకు 9, ఎంటమాలజీ (దోమల నియంత్రణ) శాఖకు ఒకటి నమోదయ్యాయి.ప్రతి ఫిర్యాదును ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ, ట్రాకింగ్ లింక్‌తో నమోదు చేసి,ఫిర్యాదు పురోగతిని పౌరులు పారదర్శకంగా తెలుసుకునే అవకాశం కల్పించారు.క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని అన్ని ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్

● భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ ● హైదరాబాద్‌లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం ● బ్రోచర్ ఆవిష్కరించిన హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి సభ్యులు





**హైదరాబాద్ : జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ ఉంటుంది. హైదరాబాద్‌లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం నిర్వహించనున్నారు. బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న మూడు రోజుల కార్యక్రమాల కోసం సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నిర్వాహకులు అంజనీ కుమార్ అగర్వాల్, సూర్య కమల్ గుప్తా, సంజయ్ అగర్వాల్, రాకేష్ జలాన్, రాకేష్ నర్సింగ్‌పురియా, సందీప్ మిత్తల్, ఘనశ్యామ్ అగర్వాల్, నవీన్ అగర్వాల్, పవన్ తిబ్రేవాల్, అంకిత్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, రూపేష్ అగర్వాల్, శుభమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు జూలై 17, 18, 19 తేదీలలో గగన్ పహాడ్‌లోని పురాన్ సన్స్ ఫార్మ్స్ (ప్రెస్టీజ్ సిటీ గేట్ ఎదురుగా) జరగనున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన నియమాలు, సేవా విధానాలు, బాధ్యతల గురించి వారికి విపులంగా వివరించారు. పురాన్ సన్స్ ఫార్మ్స్‌లో పండిత్ సంజయ్ శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం జరిగిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కన్వీనర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇంతటి భారీ స్థాయిలో ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమం తొలిసారిగా నిర్వహించబడుతోందన్నారు. అందరూ సమష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. బాగేశ్వర్ ధామ్ నుంచి 60 మంది సభ్యుల బృందం, అలాగే ఇతర ప్రాంతాల నుంచి 500 మంది రానున్నారని, వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జూలై 16 నుంచి 19 వరకు స్వచ్ఛంద సేవకులు విధుల్లో ఉండాలని సూచించారు. సేవలందించిన ప్రతి స్వచ్ఛంద సేవకునికి 'బాబా' తరపున ప్రత్యేక ప్రశంసాపత్రం (సర్టిఫికేట్) అందిస్తామన్నారు.

**17న హైదరాబాద్‌కు పూజ్య బాబా :** జూలై 17న పూజ్య బాబా హైదరాబాద్‌కు చేరుకుంటారని, ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 6 వరకు శ్రీ హనుమాన్ కథ నిర్వహించబడుతుందని తెలిపారు. రెండో రోజు శ్రీ హనుమాన్ కథతో పాటు దివ్య దర్బార్ కూడా నిర్వహిస్తామన్నారు. ఇందులో బాబా భక్తుల సందేహాలకు, ప్రశ్నలకు సమాధానాలు అందిస్తారు. ప్రతి స్వచ్ఛంద సేవకునికి మూడు రోజుల కోసం మూడు వేర్వేరు రంగుల స్కార్ఫ్‌లు, ఒక ఐడీ కార్డు అందిస్తారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లో క్రమశిక్షణతో, ఆదర్శప్రాయంగా సేవలు అందించాలని సూచించారు. సేవ చేయాలనుకునే భక్తుల కోసం కార్యక్రమ ప్రాంగణంలో ప్రత్యేక సేవా నమోదు కౌంటర్లు ఏర్పాటు చేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో, ఏఐజీ ఆసుపత్రులు ఆరోగ్య సేవలను అందించనున్నాయి. రక్తపోటు, మధుమేహ పరీక్షలు, కంటి పరీక్షలతో కూడిన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలను కూడా అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా ఈ కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవకు కూడా వేదిక కానుంది.

**భారీ ఏర్పాట్లు :** ఈ కార్యక్రమం కోసం 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ పందిరి (పండాల్) నిర్మిస్తున్నారు. ఇందులో ఒకేసారి 50వేల మంది కూర్చునే వీలుండగా మొత్తం లక్ష మందికి పైగా భక్తులు శ్రీ హనుమాన్ కథను వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి 25 మంది కోర్ కమిటీ సభ్యులతో పాటు సుమారు 500 మంది భద్రతా సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు సేవలందిస్తారని తెలిపారు. ప్రతి భక్తుని ప్రేమతో, మర్యాదతో ఆదరిస్తూ సేవాభావంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యక్రమ స్థలంలో రెండు అంబులెన్సులు , ఒక అగ్నిమాపక వాహనం సిద్ధంగా ఉంటాయి. పోలీసు శాఖ, ప్రైవేట్ భద్రతా సిబ్బంది, స్వచ్ఛంద సేవకుల సహకారంతో సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అంజనీ తెలిపారు. అదనంగా టీఎస్ఆర్టీసీ తో చర్చలు జరుపుతూ 110 మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, విశ్రాంతి కేంద్రాల నుండి కార్యక్రమ ప్రాంగణానికి భక్తులను తరలించేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. విస్తృత పార్కింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వహణలో సమర్థవంతమైన సమన్వయం కోసం ఆహారం, ఆహ్వానాలు, పూజా విభాగం, ఆరోగ్యం , అత్యవసర వైద్య సేవలు, సోషల్ మీడియా, ముద్రణ, అలంకరణ, క్యాటరింగ్, పార్కింగ్, గ్రౌండ్ మేనేజ్‌మెంట్, ప్రెస్ , మీడియా, వేదిక భద్రత, ప్రకటనలు, ప్రచారం, ప్రయాణం/టాక్సీలు, బస్సు సేవలు, ఫోటోగ్రఫీ తదితర విభాగాలకు ప్రత్యేక ఉపకమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో తొలిసారిగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, చిరస్మరణీయంగా, చారిత్రాత్మకంగా నిలబెట్టేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మనీష్ అగర్వాల్ ఏర్పాట్లపై స్వచ్ఛంద సేవకులకు పూర్తి వివరాలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అదనంగా ధీరేంద్ర శాస్త్రి పాల్గొనే ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

# విరసం సభను అడ్డుకోవడం అప్రజాస్వామికం

**- సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి.**

**-భావవ్యక్తీకరణ స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కులో బాగమే.**



**జవహర్ నగర్, జూలై 6:(వార్తా ప్రభ)**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ పోలీసులు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగాల్సిన హాల్ మీటింగ్ ను, పర్మిషన్ లేదనే పేరిట జూలై–5 న విరసం సభను అడ్డుకోవడాన్ని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి తీవ్రంగా ఖండించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛను కాలరాయడం అప్రజాస్వామికం అని అన్నారు. హాలులో జరిగే సభలు, సమావేశాలకు కూడ పర్మిషన్ తీసుకోవాలని పోలీసులచేత చెప్పించడం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలోని డొల్లతనం స్పష్టంగా తేటతెల్లం అయ్యిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో బిన్నభిప్రాయాలు, రాజకీయ విశ్వాసాలు కలిగిన వారిని ఉద్దేశ పూర్వకంగా అణిచివేతకు గురిచేసే కుట్రపూరితమైన చర్యలు పౌర, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, భారత రాజ్యాంగ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని 2026, జూలై–6, సోమవారం రోజు పంపిన ప్రకటనలో షేక్ షావలి పేర్కొన్నారు. తమ నేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ బడా కార్పొరేట్, సామ్రాజ్యవాద అనుకూల రాజకీయ విధానాలకు వంతపాడడం తమ ద్వంద విధానాలకు పరాకాష్టకు నిదర్శనంగా నిలుస్తాయని అన్నారు. ఇప్పటికైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక, ప్రజావ్యరేతక విధానాలకు స్వస్తిపలకాలని, లేనియెడల ప్రజల విశ్వాసాలను, మద్దతును కోల్పోయే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా షేక్ షావలి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

# చంద్రపురి కాలనీ డివిజన్‌లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించిన బీజేపీ నాయకులు



**జవహర్ నగర్, జూలై 6:(వార్తా ప్రభ)**కీసర సర్కిల్ జవహర్ నగర్ పరిధిలోనిచంద్రపురి కాలనీ డివిజన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో, డివిజన్ అధ్యక్షులు కర్లపూడి జోగారావు నాయకత్వంలో సిఆర్పిఎఫ్ అరుంధతి నగర్ బూత్ నంబర్లు 598, 599, 600, 601 మరియు మల్కారం బూత్ నంబర్ 594 పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజల ఇంటింటికి వెళ్లి కలుసుకుని, ఓటరు జాబితాలో తమ పేర్లు, చిరునామా మరియు ఇతర వివరాలను సరిచూసుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు అత్యంత విలువైనదని, స్వచ్ఛమైన మరియు పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఎంతో కీలకమని వివరించారు.ఈ కార్యక్రమంలో సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, సీనియర్ నాయకులు ఓం ప్రకాష్, అశోక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదగిరి, మల్లికార్జున్ గౌడ్, రామ్ చారి, మహేష్ గౌడ్, శ్రీను తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి కుటుంబం ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు తన బాధ్యతను నిర్వర్తించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు.

# మహానీయుడు బాబు జగ్జీవన్ రామ్ ఆశయసాధనలో ముందుకు సాగుదాం

## తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా. పేట భాస్కర్



**కోరుట్ల,జూలై 06 (వార్తా ప్రభ):**:భారత మాజీ ఉప ప్రధాని, సమతావాది బాబు జగ్జీవన్ రామ్ ఆశయసాధనలో అందరు బాగస్వామ్యం అయి ముందుకు సాగాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేట భాస్కర్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ సేవలకు గుర్తుగా పట్టణంలో ఆయన పేరిట నిర్మిస్తున్న జగ్జీవన్ పార్క్ నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందని నాయకులు హామీలు ఇస్తున్నారు

వార్తా ప్రభ

# హైదరాబాద్

## దమ్మాయిగూడ లో రాఘవేంద్ర ఉడిపి హోటల్‌ను ప్రారంభించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్





**దమ్మాయిగూడ, జూలై 6:(వార్తా ప్రభ)**మల్కాజ్గిరి కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రాఘవేంద్ర ఉడిపి హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్–-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, స్థానికంగా కొత్త వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ఉపాధి అవకాశాలు పెరగడానికి దోహదపడుతుందని అన్నారు. వ్యాపారవేత్తలు నాణ్యమైన సేవలను అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షులు ముప్పు రామ రావు, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, హోటల్ యాజమాన్యం, కార్యకర్తలు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండాపూర్ ను ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతాం

**"రూ.5.38 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తో కలిసి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన**



**శేరిలింగంపల్లి,జూలై 6 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్‌లో రూ.5.38 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ,మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ సోమవారం శంకుస్థాపన చేశారు.ప్రేమ్‌నగర్‌లో హిందూ స్మశానవాటిక అభివృద్ధి, ఓయూ ప్రొఫెసర్ కాలనీ, శ్రీరామ్‌నగర్ ఏ బ్లాక్‌లలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.నాణ్యతతో పనులు పూర్తి చేసి కొండాపూర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని అరెకపూడి గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# వాయుపురి కాలనీ లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి



**మల్కాజిగిరి జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):** మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బీజేపీ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా కాకతీయ నగర్ డివిజన్ పరిధిలోని వాయిపురి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వినాయక్ నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం విశేష కృషి చేసిన గొప్ప జాతీయవాద నాయకుడని కొనియాడారు. దేశ ప్రయోజనాల కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు ఆనంద్ గౌలికర్, మంగేష్ కుమార్ , మల్లేష్, సుమలత, తిరుమల, సాయి సురేష్, సోమనాద్, వెంకటేష్, రమేష్, ప్రశాంత్, మల్లికార్జున్, రెడ్డి, ముకేశ్, నందు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మనసు అక్కడ... వైసీపీ ఇంచార్జి ఇక్కడ !

ఆయన మనసు పూర్తిగా తాను రెండు సార్లు వరసగా గెలిచిన చోట ఉంది. అయితే అధినాయకత్వం మాత్రం ఊహించని విధంగా ఆయనను మూడు జిల్లాలు దాటించి బదిలీ చేసింది. ఎన్నికలు ముంగిటిలో ఉండగా సడెన్ గా వచ్చి అనకాపల్లి జిల్లాకు చివరన ఉన్న పాయకరావుపేటలో పోటీకి సిద్ధమయ్యారు. తీరా చూస్తే ఫలితం తేడా కొట్టింది. ఓడి రెండేళ్ళు అయినా ఆయనే అక్కడ వైసీపీ ఇంచార్జి. ఆయనే కంబాల జోగులు. మాజీ ఎమ్మెల్యే. రాజాం నుంచి 2014, 2019లలో రెండు సార్లు గెలిచిన జోగులుని వైసీపీ 2024లో చేసిన ట్రాన్స్‌ఫర్స్ ప్రయోగంలో భాగంగా జిల్లాలు దాటించి మరీ పేటకు వెళ్ళమంది. సరేనంటూ వచ్చిన జోగులుకి చేదు అనుభవం ఎదురైంది. . ఇచ్చిన మాట నిలబెట్టుకున్న టీడీడీ సహకరించని క్యాడర్ తో : ఇక పాయకరావు పేట ఎస్సీ నియోజకవరమే కానీ అక్కడ గెలుపు గుర్రాలు గా ఎవరు ఉండాలన్నా బలమైన కాపు సామాజిక వర్గం మద్దతు నిర్ణయమే కీలకం. మొత్తం నాలుగు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో కాపుల బలం ఎక్కువ. ఆ తరువాత మత్స్యకారులు కూడా ముఖ్య పాత్ర పోషిస్తారు. అలాగే ఎస్సీలు కూడా గణనీయంగా ఉన్నారు. ఇక వైసీపీలో చూస్తే వర్గ పోరు పీక్స్ లో ఉన్న సీటు ఇది. మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుది ఒక వర్గం అయితే ఆయన పొడ గిట్టని ప్రత్యర్ధులది వేరే వర్గం. ఇక తటస్థంగా ఉన్న వారు మరో వర్గం. కంబాల జోగులు అయితే ఏకంగా జిల్లాకే కొత్త. దాంతో ఏ వర్గమూ ఆయనకు మద్దతుగా నిలవడం లేదని అంటున్నారు. దాంతో పాటు ఆయన కూడా కో ఆర్డినేషన్ చేసుకోవడంలో విఫలం అవుతున్నారని అంటున్నారు. ఇక కంబల జోగులు రాజాం నుంచే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని చూస్తున్నారు. అయితే అక్కడ 2024 ఎన్నికల్లో ఒక డాక్టర్ ని వైసీపీ కొత్తగా తెచ్చి బరిలో నిలిపింది. ఆయన ఓటమి పాలు అయ్యారు కానీ గత రెండేళ్ళుగా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్నారు. ఇక 2024లో జోగులుకి టికెట్ ఇస్తే ఓటమి పాలు అవుతామని భావించే వైసీపీ ఆయనను ట్రాన్స్‌ఫర్ చేసింది. అయితే ఆయనకి టికెట్ ఇవ్వకుండా ఉంటే భావ్యం కాదని పాయకరావుపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న గొల్ల బాబూరావుకు రాజ్యసభ సీటు ఇచ్చింది. అలా లైన్ క్లియర్ చేసి మరీ జోగులుని అక్కడికి పంపించింది. ఇక జోగులుకి పాయకరావు పేట వద్దు అంటే రాజాం లో మళ్ళీ టికెట్ ఇచ్చేది లేదని కూడా అంటున్నారు. ఎందుకంటే 2029లో డాక్టర్ గారికే టికెట్ ఇస్తారు అని వైసీపీలో వినిపిస్తున్న మాట. పాపం కంబాల జోగులు రాజకీయం చూస్తే ఊగిసలాటలోనే ఉందని అంటున్నారు. పాయకరావుపేటలో క్యాడర్ అంతా కొత్త నాయకత్వం కావాలని కోరుతున్నారు. అది కూడా స్థానికులకే చాన్స్ ఇవ్వాలని అంటున్నారు. అపుడే టీడీపీకి ఎంతో బలం ఉన్న పాయకరావుపేటను గెలుచుకోగలమని చెబుతున్నారు. ఇక బాబూరావు విషయం తీసుకుంటే ఆయన తన వారసులకు టికెట్ ఇప్పించుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఆయన అంటే గిట్టని ప్రత్యర్ధి వర్గం తమ వైపు నుంచే ఇంచార్జి ఉండాలని పట్టుబడుతోంది. ఇలా పేటలో వైసీపీ వర్గ పోరు పీక్స్ కి చేరుకుంది. అదే సమయంలో ఇంచార్జిగా ఉన్న కంబాల జోగులు మనసు అక్కడ లేదని అంటున్నారు. మొత్తానికి పాయకరావుపేట జాతకం జోగులు రాజకీయం ఎప్పటికి ఏ విధంగా తేలేను అన్నది అతి పెద్ద ప్రశ్నగా మారింది.

## సర్ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను సందర్శించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు





**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, మార్పులు చేర్పుల మరియు ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపడంలో ప్రజలకు సహాయపడేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలను మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు.?ఈ పర్యటనలో భాగంగా 41, 42, 43వ డివిజన్ల పరిధిలోని మసీదు వీధి, మున్నలూరి సుబ్బారాయుడు వీధి, హోసింగ్ బోర్డ్ కాలనీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆయన స్వయంగా పరిశీలించారు. అక్కడ ఫామ్స్ నింపుతున్న ఓటర్లతో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫార్మ్ను నింపి, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తో పాటు ధ్రువీకరణ పత్రాలను జతపరిచి బూత్ లెవల్ అధికారులకు అందచేయాలని ఆయన ఓటర్లకు అవగాహన కల్పించారు.?ఈ సందర్భంగా మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటు హక్కు కాపాడుకునేలా స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రజలకు ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపడంలో, 2002 సర్ వివరాలు వెతకడంలోనూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శిబిరాల నిర్వాహకులు ఓటర్లకు తగిన సహాయం అందించాలని ఆయన స్పష్టం చేశారు.

## స్పెషల్ ఇంటెన్సీ ప్రీవియషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్పెషల్ ఇంటెన్సీ ప్రీవియషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం మధ్యాహ్నం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)--2026 కార్యక్రమంలో భాగంగా పాయకాపురం ప్రాంతంలోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓల ద్వారా జరుగుతున్న ఫారాల సేకరణ, డేటా మ్యాపింగ్, ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఎస్‌హెచ్‌జీ నెట్‌వర్క్, బీఎల్ఓలను పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి అవసరమైన శిక్షణ అందించామని కమిషనర్ తెలిపారు. 2002 నాటి ఓటర్ల వివరాలు, తల్లిదండ్రులు లేదా పూర్వీకుల వివరాలపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రతి బీఎల్ఓ పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అక్కడ ఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉండి ఓటరు ఎక్కడ మ్యాప్ అయి ఉన్నారో గుర్తించడంలో ప్రజలకు సహాయం చేస్తున్నట్లు వివరించారు.ఇప్పటివరకు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 45 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన పనిని రాబోయే రెండు రోజుల్లో పూర్తి చేయడానికి మున్సిపల్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని వెల్లడించారు. మైక్ అనౌన్స్‌మెంట్లు, మీడియా ప్రచారంతో పాటు, స్థానికంగా అందుబాటులో లేని వారికి వాట్సాప్ సందేశాలు, ఫోన్ కాల్స్ ద్వారా సమాచారం అందిస్తున్నామని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎవరికైనా సందేహాలు ఉంటే వెంటనే తమ పరిధిలోని సచివాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ కోరారు. అక్కడి సచివాలయ సెక్రటరీలు ఫారాలు ఎలా పూరించాలి, ఆన్‌లైన్ ప్రక్రియ ఎలా పూర్తి చేయాలి అనే విషయాలను వివరంగా తెలియజేస్తారన్నారు. ప్రజలకు సుపరిచితులైన ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, అధికారులు కూడా అవసరమైన సహాయం అందిస్తారని స్పష్టం చేశారు.ప్రజలు చురుకుగా పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తూ, ఎవరి వద్ద ఫారాలు ఉండి వాటిని పూరించడం తెలియకపోతే ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే సిబ్బంది స్వయంగా వచ్చి తీసుకెళ్తారని, లేదా సమీప క్యాంపులోనే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తారని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కే. సంజయ్ రత్నకుమార్, సూపర్వైజర్లు, బీఎల్ఓలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ 40 వ వర్ధంతి సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని నివాళి



**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా గురునానక్ కాలనీ లోని ఎంపీ కార్యాలయం లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ భారత ప్రజాస్వామ్య చరిత్రలో చెరగని ముద్ర వేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం, ప్రజాసేవ కోసం ఆయన చేసిన కృషి దేశానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధికి విశేష సేవలు అందించిన మహనీయుడిగా బాబు జగ్జీవన్ రామ్ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆ మహానేతకు ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సొంగా సంజయ్ వర్మ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు,కొట్టేటి హనుమంతరావు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు,పరిశిపోగు రాజేష్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి,నాలుగో డివిజన్ మాజీ కార్పొరేటర్ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు జాస్తి సాంబశివరావు గారు,నందిపాటి దేవానంద్ కుమార్ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు,దేవరపల్లి ఆంజనేయులు,ఎస్సీ సెల్ తూర్పు నియోజకవర్గ అధ్యక్షులు పల్లె పోగు ప్రసాద్,వెస్ట్ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు,మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జీవీ నరసింహారావు,రెండో డివిజన్ అధ్యక్షులు దాసరి గాబ్రియల్,మూడో డివిజన్ అధ్యక్షులు బాబురావు,తెలుగుదేశం పార్టీ తూర్పు నియోజకవర్గ నాయకులు మల్లెలరామకృష్ణ,మాజీ కార్పొరేటర్ నరసింహ చౌదరి ,తెలుగుదేశం పార్టీ నాయకులు మాదిగాని గురునాథం తదితరులు పాల్గొన్నారు..

## ప్రజల సమస్యలపై శాఖాధిపతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**









**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు.ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన కమిషనర్, గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని శాఖాధిపతులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు.మున్సిపల్ సేవల కోసం రూపొందించిన "పురమిత్ర" యాప్‌లో నమోదవుతున్న ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను ఒక శాఖ నుండి మరో శాఖకు మళ్లించడం కాకుండా, సంబంధిత అధికారులు స్వయంగా స్పందించి సమస్యలకు పరిష్కారం చూపాలని కమిషనర్ స్పష్టం చేశారు. శాఖలన్నీ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు.ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 19 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించిన అక్రమ నిర్మాణాలు 10, రోడ్ల ఆక్రమణలు వంటి అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు నమోదు కాగా, పబ్లిక్ హెల్త్ 2, ఇంజనీరింగ్ 3, పిఓ యుసిడి 4 ఫిర్యాదులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును అధికారులు స్వయంగా పరిశీలించి, ప్రజలకు స్పష్టమైన మరియు శాశ్వత పరిష్కారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె. శకుంతల, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ ను తనికీ చేసిన మండల విద్యాశాఖ అధికారులు



**రెడ్డిగూడెం జులై 6(వార్తాప్రభ ప్రతినిధి ):**యండిఎం డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నాడు రెడ్డిగూడెం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ ను రెడ్డిగూడెం మండల విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. యండిఎం వంట చేస్తున్న పరిసరాలను పరిశీలించి యండిఎం మరియు ముఖ్యమైన రిజిస్టర్స్ ను తనిఖీ చేసి, విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకొని,మధ్యాహ్నం భోజనం రుచి చూసి తదుపరి ప్రిన్సిపాల్ కి తగు సూచనలు చేసినారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖ అధికారులు కె. శంకరరావు మరియు పి రమేష్ బాబు పాల్గొన్నారు.

## పునర్వ్యవస్థీకరణలో రిజర్వేషన్లు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు పూర్తి రక్షణ కల్పించాలి

**క్యాడర్ మార్పులతో ఏ వర్గానికీ అన్యాయం జరగకూడదు.**

**అవసరమైతే ప్రక్రియకు మరింత సమయం కేటాయించాలి**

**-నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్**

**విజయవాడ, జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పోస్టుల పునఃపంపిణీ నేపథ్యంలో జిల్లాల వారీగా క్యాడర్ స్ట్రెంత్ మారుతున్నందున, ఎస్సీ ఎస్టీ బీసీ ఓబీసీ సహా అన్ని వర్గాల రిజర్వేషన్ హక్కులు, బ్యాక్‌లాగ్ పోస్టులు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు పూర్తి రక్షణ కల్పించే సమగ్ర విధానాన్ని రూపొందించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్.టి. ఏ.) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.ప్రతి జిల్లాలో మంజూరైన పోస్టులు, ఖాళీలు, వర్గాల వారీ ప్రాతినిధ్యం, బ్యాక్‌లాగ్‌ను సమగ్రంగా పరిశీలించి, క్యాడర్ స్ట్రెంత్‌లో మార్పులకు అనుగుణంగా పోస్ట్–బేస్డ్ రోస్టర్‌ను నిబంధనల మేరకు సవరించాలని ఎన్.టి. ఏ.రాష్ట్ర అధ్యక్షులు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు కోరారు."పునర్వ్యవస్థీకరణ కారణంగా రిజర్వేషన్ హక్కులు ప్రభావితం కాకూడదు; క్యాడర్ స్ట్రెంత్ మార్పులతో భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు తగ్గకూడదు; బ్యాక్‌లాగ్ పోస్టులు కోల్పోకూడదు" అని వారు స్పష్టం చేశారు.అన్ని జిల్లాలకు సమానమైన భవిష్యత్ నియామక అవకాశాలు కల్పించేలా "డైనమిక్ క్యాడర్ స్ట్రెంత్--రిజర్వేషన్ పరిరక్షణ విధానం" రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరినట్లు తెలిపారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు అవసరమైతే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు మరింత సమయం కేటాయించాలని కూడా కోరారు.

## చిట్టినగర్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామివారి 15వ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగింపు

**2,500 మందికి అన్నప్రసాద వితరణ**



**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్‌లో వెలసి ఉన్న శ్రీ గోదాదేవి, పద్మావతి దేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం దేవస్థానం కళ్యాణ మండపంలో సుమారు 2,500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.దేవస్థాన నిత్య పూజారులు, దాతల సహకారంతో అన్నప్రసాద కార్యక్రమాన్ని అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో స్వీకరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యదర్శి మరు పిళ్ళా హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు, పొట్లూరి రాజా, కోరగంజి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు పిళ్ళా విజయ్, మజ్జి శ్రీనివాసరావు, కామందుల నరసింహారావు, పోతిన ధర్మారావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామివారి అనుగ్రహం అందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు.

## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ అన్నారు. కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ అండ్ మిషన్‌లెర్నింగ్ విభాగం ఆధ్వర్యంలో యుజీంగ్ ఫ్లూటర్ సాంకేతికతను ఉపయోగించి రూపొందించిన ప్రొడక్ట్ ఎక్స్‌ఫో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ సమాజంలో మొబైల్ వినియోగం విశేషంగా పెరిగిందన్నారు. మొబైల్ ద్వారా అనేక నిత్యవసర పనులు జరుగుతున్నాయని వివరించారు. ఆ క్రమంలో మొబైల్‌లో వినియోగించే వివిధ అప్లికేషన్స్ తయారీపై దృష్టి సారించాలన్నారు. అందుకు ఉపయోగపడే నూతన సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాప్ డిజైనింగ్ నిపుణులు ఎం జ్యోతి, వీ వంశీకృష్ణ తదితరులు ఎక్స్‌పోకు న్యాయనిర్ణేతలుగా వ్యవహించారు. కార్యక్రమంలో విభాగాధిపతి వీ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ కు ఘన నివాళులు





**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, ప్రముఖ విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125 వ జయంతి సందర్భంగా బూత్ కమిటీ సభ్యులు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు..సోమవారం , హెచ్ బీ కాలనీ 10 వ నెంబర్ బూత్ పరిధిలో స్థానిక నాయకు లందరూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు.. జయంతి వేడుకల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను ఇచ్చి బూత్ పరిధిలో మొక్కలు నాటారు.. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కందుల సుబ్రహ్మణ్యం యాదవ్, పగడాల కృష్ణ, జయ బాలన్, అల్లంకి శ్రీను, మనోజ్, ఖాసీం దొడ్ల రాజా పాల్గొన్నారు..

## బాధితుడికి ఎల్ఓ సీ అందజేత





**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజన చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ (క్రెడిట్) ను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్,40 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీవీ చిన సుబ్బయ్య, టీడీపీ నాయకులు మన్నం నారాయణ, బీజేపీ నాయకులు దుర్బేసుల హుస్సేన్ కలిసి అందజేశారు .. 40 వ డివిజన్ , భవానీపురం కు చెందిన మహమ్మద్ ఖాలీద్ అహ్మద్ (59) నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు అతనికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2 లక్షల 55 వేల ఎల్ ఓ సీ ను బాధితుడికు అందజేశారు.. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధితుడు ఎమ్మెల్యే సుజనా కు కృతజ్ఞతలు తెలిపారు.

## సర్ డిజిటైజేషన్ సజావుగా..

**- జిల్లాలో 54.61 శాతం మేర పూర్తయిన ప్రక్రియ**

**- నిరంతర పర్యవేక్షణతో వేగవంతానికి కృషి**

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ సజావుగా సాగుతోందని.. ఈ ప్రక్రియ వేగవంతానికి నిరంతర పర్యవేక్షణతో, మార్గనిర్దేశంతో కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో, సమర్పించడంలో సహాయం చేయడానికి అందుబాటులో ఉన్న హెల్ప్ డెస్కులను సద్వినియోగం చేసుకునేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 9,35,754 (54.61 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. తిరువూరులో 1,46,751 (70.31 శాతం) డిజిటైజేషన్ జరగ్గా.. విజయవాడ పశ్చిమలో 1,10,300 (42.92 శాతం), విజయవాడ సెంట్రల్ 1,26,272 (45.45 శాతం), విజయవాడ తూర్పు 1,28,050 (47.47 శాతం), మైలవరం 1,83,067 (64.2 శాతం), నందిగామ 1,26,765 (61.1 శాతం), జగ్గయ్యపేటలో 1,14,549 (55.19 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించేలా ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

# తిరుపతి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎనిమిది మంది క్రీడాకారులు





**తిరుపతి : జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుపతి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపికలు ఆదివారం బాలాయపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. జిల్లాలోని పలు విద్యాసంస్థల నుంచి సుమారు 40 మంది బాలబాలికలు ఈ ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ఎంపికలను తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్), ఉపాధ్యక్షుడు పైడి కోటేశ్వరరావు, పాఠశాల పీడీ వై. సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక కావడం గర్వకారణమని, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి తిరుపతి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, అనూష, సునంద, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో లో నిర్వహించనున్న 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ బాలబాలికల ఛాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులు:సబ్ జూనియర్ బాలికలు : ఆర్. వెన్నెల – జడ్పీ హెచ్‌ఎస్, అత్తివరం, వై. పావని– జడ్పీ హెచ్‌ఎస్, అత్తివరం, పి. చెంచు గంగమ్మ – జడ్పీ హెచ్‌ఎస్, అత్తివరం, ఎస్.కె. హలీమా – జడ్పీ హెచ్‌ఎస్, బాలాయపల్లి సబ్ జూనియర్ బాలురు: జె. వివేకానంద -- జడ్పీ హెచ్‌ఎస్, అత్తివరం, జె. మధు -- జడ్పీ హెచ్‌ఎస్, అత్తివరం, జె. హర్ష – జడ్పీ హెచ్‌ఎస్, అత్తివరం, జి. ప్రభాస్ -- జడ్పీ హెచ్‌ఎస్, జయంపు.

## ‘ మీకోసం’లో ఫోన్లపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం .

**ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చినప్పుడు పూర్తి ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలి: అధికారులకు సూచన**



**మచిలీపట్నం జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ‘మీకోసం’ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్ కొంతమంది అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో కొంతమంది అధికారులు సెల్‌ఫోన్లలో మాట్లాడుతున్న విషయాన్ని ఆయన గమనించారు. దీంతో వెంటనే స్పందించిన జాయింట్ కలెక్టర్, ప్రజల సమస్యలు వినేందుకు నిర్వహించే కార్యక్రమంలో అధికారులు ఫోన్లలో మాట్లాడటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల వినతులను శ్రద్ధగా ఆలకించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల సమయంలో అధికారులు పూర్తి ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలని, అత్యవసర పరిస్థితులు మినహా సెల్‌ఫోన్ల వినియోగాన్ని నివారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధికారులు కూడా అదే బాధ్యతతో వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.

## అసిస్టెంట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. 10వ డివిజన్ సచివాలయంలో రికార్డుల పరిశీలన



**మచిలీపట్నం జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నంలోని 10వ డివిజన్ సచివాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ నమ్రత అగర్వాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ శాఖల రికార్డులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి, వాటి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, దరఖాస్తుల పరిష్కార విధానం, రికార్డుల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ పరిధిలో ఇటీవల నిర్మాణంలో ఉన్న నూతన భవనాల ప్లాన్ అనుమతుల (బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్) వివరాలను పరిశీలించారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేస్తున్నారా? అని పరిశీలించారు.

## జగ్గయ్యపేట ముఖచిత్రం మారనుంది

**రూ.6.30 కోట్లతో నూతన రహదారి నిర్మాణం**



**జగ్గయ్యపేట జులై 6 (వార్తప్రభ)**పట్టణ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. పట్టణంలోని అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ నుండి నేషనల్ హైవే వరకు 1.6 కిలోమీటర్ల మేర నిర్మించనున్న నూతన రహదారికి రూ.6 కోట్ల 30 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మార్గం పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటిగా, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, స్థానిక వ్యాపార కార్యకలాపాలకు కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్న ఆయన, నిర్మాణంలో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యత, పని తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రహదారి నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులకు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగానే పనులు జరగాలని, ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, నిర్దేశిత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ రహదారి పూర్తయితే జగ్గయ్యపేట పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారుతుందని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. రవాణా వ్యవస్థ మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు, దీర్ఘకాలంగా ప్రజలను వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు గణనీయమైన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అంతేకాక, ఈ రహదారి వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని, వ్యవసాయ మార్కెట్‌కు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి మౌలిక సదుపాయాన్ని ప్రభుత్వం అందించేందుకు కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు జగ్గయ్యపేటకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు గింజుపల్లి కృష్ణ, గొట్టే నాగరాజు, నకరికంటి వెంకటి, టీడీపీ నాయకులు మల్లెల కొండయ్య, కర్ల జోజి,దువ్వల రామకృష్ణ ,గుమ్మా వెంకటేష్, గుడారు పేరయ్య,షేక్ అక్బర్, మీసాల బాబులు,పాటు ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రుయా ఆసుపత్రిలో 15 నెలల చిన్నారికి అరుదైన చికిత్స విజయవంతం



**తిరుపతి ,జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న రుయా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని నిరూపించారు. అత్యాధునిక వైద్య సాంకేతికతను వినియోగిస్తూ 15 నెలల చిన్నారికి శస్త్రచికిత్స లేకుండానే ప్రాణాపాయ సమస్యను విజయవంతంగా పరిష్కరించి వైద్య రంగంలో మరో అరుదైన విజయాన్ని నమోదు చేశారు. చిత్తూరు జిల్లా గంగాధర్ నెల్లూరు మండలానికి చెందిన 15 నెలల తాబిష్ అలీ తీవ్ర కడుపునొప్పి, కడుపు వాపు, మలంలో రక్తస్రావం వంటి లక్షణాలతో రుయా ఆసుపత్రి అత్యవసర విభాగానికి చేరుకున్నాడు. చిన్నారి పరిస్థితిని పరిశీలించిన చిన్నపిల్లల శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ ఎ.బి. జగదీష్, అతడు ‘ఇంటసస్సెప్షన్’ అనే అరుదైన, ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతున్నట్లు వెంటనే గుర్తించారు. ఈ వ్యాధిలో ఒక ప్రేగు మరొక ప్రేగులోకి జారిపోవడంతో అత్యవసర చికిత్స అవసరమవుతుంది. సాధారణంగా ఈ సమస్యకు ఓపెన్ సర్జరీ చేయాల్సి వస్తుంది. అయితే డాక్టర్ జగదీష్ నేతృత్వంలోని వైద్య బృందం సి–ఆర్మ్ ఇమేజింగ్ సాంకేతికత సహాయంతో ‘న్యూమాటిక్ రిడక్షన్’ విధానాన్ని విజయవంతంగా అమలు చేసింది. నియంత్రిత గాలి పీడనం ద్వారా ఎలాంటి కోతలు, శస్త్రచికిత్స అవసరం లేకుండానే ప్రేగును సాధారణ స్థితికి తీసుకువచ్చి చిన్నారిని పూర్తిగా కోలుకునేలా చేశారు. ఈ చికిత్సను ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకుంటే రూ.70 వేల నుంచి రూ.1 లక్ష వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అయితే రుయా ఆసుపత్రిలో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సేవ పథకం కింద పూర్తిగా ఉచితంగా అందించారు. ఈ చికిత్సలో అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పద్మజ, డాక్టర్ మైథిలి, డాక్టర్ మధుసూదన్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ కిరీటి కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవడంతో తల్లిదండ్రులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ ఎ.బి. జగదీష్‌తో పాటు వైద్య బృందాన్ని రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవిప్రభు, ఆర్ఎంఓ డాక్టర్ సుబ్బలక్ష్మి, ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ అభినందించారు.

## 290 పెంపుడు జంతువులకు ఉచిత రేబీస్ టీకాలు.

**జంతువుల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన**



**మచిలీపట్నం జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మచిలీపట్నంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే జూనోటిక్ వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు ప్రధానమైనవని తెలిపారు. ఈ వ్యాధుల నివారణకు పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే పశు వైద్యులను సంప్రదించడం అత్యంత అవసరమని సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక టీకాల కార్యక్రమంలో 260 పెంపుడు కుక్కలకు, 30 పిల్లులకు ఉచితంగా రేబీస్ నిరోధక టీకాలు వేశారు. రేబీస్ వ్యాధి నివారణలో టీకాల ప్రాధాన్యతను వివరించిన అధికారులు ప్రతి పెంపుడు జంతువుకు నిర్ణీత కాల వ్యవధిలో టీకాలు వేయించాలని యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ గ్రంథాలయ చైర్మన్ జి. గోపీచంద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, ఎస్పీసీఏ సభ్యుడు ఫణి హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. జంతు సంక్షేమం, ప్రజారోగ్యం పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎం. శ్రీనివాసరావు, ఉపసంచాలకులు డా. ఎస్. సజ్జా నాగభూషణ బాబు, విశ్రాంత పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారి డా. వీరంకి మధుసూదన్ రావు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా. వీరంకి మధుబాబు, పశువైద్య శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వార్డ్ లో కనపడని అభివృద్ధి

**ఫోను ఎత్తని కౌన్సిలర్ - వెటకారంగా సమాధానం చెబుతున్న చైర్మన్**

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు**



**జగ్గయ్యపేట జులై 6 (వార్తప్రభ)** పట్టణంలోని ఏడో వార్డు ఆర్టీసీ కాలనీ అభివృద్ధి అనే మాట కు ఆమడ దూరంలో ఉందని. తమ కాలనీ పల్లెటూరు కంటే అధ్వానం గా ఉందని . ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన కౌన్సిలర్ సమస్యలు తెలియజేద్దామంటే కనీసం ప్రజల ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదని, కనీసం కంటికి కూడా కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు,వీధిలైట్లు వంటి అభివృద్ధి పనులు కావాలని వినతి పత్రాలతో వెళ్తున్న ప్రజలకు మున్సిపాలిటీలో నిధులు లేవని చైర్మన్ వెటకారంగా సమాధానం చెబుతున్నారని ఇదేం పద్ధతిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు?. మౌలిక సదుపాయాలు కల్పించాలని పీజీఆర్ఎస్ లోనూ, స్వయంగా వినతి పత్రాలు సమర్పిస్తుంటే మున్సిపల్ అధికారులు ఏదో ఒక సాకుతో సమస్యల గురించి పట్టించుకోకుండా ఫిర్యాదులు పరిష్కరించినట్లు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారని ప్రజా సమస్యలపై నిమ్మకు నీరు ఎత్తినట్లు మున్సిపల్ అధికారులు ప్రవర్తిస్తున్నారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య కోట్లాది రూపాయల నిధులు మున్సిపాలిటీ అభివృద్ధికి తీసుకువస్తుంటే క్రింది స్థాయి అధికారులు, నాయకులు వలన ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, కాలనీలో తలెత్తుకొని తిరిగే పరిస్థితి లేదని కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో చాలా వీధిలైట్లు పనిచేయడం లేదు, మరియు ప్రజలు స్వయంగా స్తంభాలు ఏర్పాటు చేసుకున్నా వాటికి వీధిలైట్లు వేయలేని పరిస్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయవలసి ఉంది ఎన్నిసార్లు అడిగినా వాటి గురించి పట్టించుకునే నాధుడే లేడు. ప్రజలకు మున్సిపాలిటీలో నిధులు లేవని వెటకారంగా సమాధానం చెబుతున్న చైర్మన్ కోట్లాది రూపాయలు అభివృద్ధి చేస్తున్నామని పత్రికలలో చేసే, ప్రకటనలు ఊకదంపుడు ఉపన్యాసాలేనా?. డి ఎం ఎఫ్ గ్రాంట్లలో ఏడో వార్డు ఆర్టీసీ కాలనీలో అభివృద్ధి పనులు ఎక్కడ?. మీ పరిపాలన కాలంలో ఏడో వార్డులో చేసిన అభివృద్ధి పనులు ఏమిటి ?. రెండుసార్లు వరదల వలన, ఇటీవల గాలి దుమ్ము వర్షానికి నష్టపోయిన ప్రజలకు మున్సిపాలిటీ నుండి ఏమైనా సహాయ సహకారాలు అందించారా? – కనీసం పరామర్శించారా?. అని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు, నాయకులు ఇష్టా రాజ్యాంగ వ్యవహరించడం వల్ల తమ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని. పట్టణంలో ప్రజలు ఇల్లు లేని దగ్గర డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మించే మున్సిపాలిటీ వారు తక్షణమే కాలనీలో అభివృద్ధి పనులు ప్రారంభించక పోతే వచ్చే కౌన్సిల్ సమావేశంలో మున్సిపాలిటీ ముట్టడి చేస్తామని. మరియు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తమ కాలనీలో అభివృద్ధి చేసిన నాయకులకి ఓట్లు వేస్తామని ప్రజలు తెలియజేస్తున్నారు.

## సీనియర్ సిటిజన్ చట్టాన్ని మరింత కఠినతరం చేయాలి: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్



**మచిలీపట్నం జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సీనియర్ సిటిజన్ల హక్కులను పరిరక్షించే చట్టాన్ని మరింత కఠినతరం చేసి, వృద్ధులకు సమగ్ర రక్షణ కల్పించాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి కోరారు. ఈ మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో అనేక మంది పిల్లలు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, మానసికంగా శారీరకంగా వేధించడం, వారి పేరున్న ఆస్తులను తమ పేరుకు రాయాలని ఒత్తిడి చేయడం, చివరకు వృద్ధాశ్రమాల్లో వదిలివేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల వల్ల వృద్ధులు తీవ్ర మనోవేదనకు గురవుతూ, తమ జీవితాన్ని గౌరవంగా గడపలేకపోతున్నారని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల భద్రత, వారి ఆస్తుల రక్షణ, జీవనోపాధి, ఆరోగ్య అవసరాలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజన్ చట్టాన్ని మరింత కఠినతరం చేసి, తల్లిదండ్రుల పోషణ బాధ్యతను విస్మరించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలు అమలు చేయాలని కోరారు. అలాగే వృద్ధులు ఎలాంటి భయాందోళనలు లేకుండా గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ తరఫున కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## ‘మీకోసం’ కార్యక్రమంలో నిబంధనలు పాటించాలి..

**బీజేపీ నాయకులకు జాయింట్ కలెక్టర్ సూచన**



**మచిలీపట్నం జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ‘మీకోసం’ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులకు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో కొందరు బీజేపీ నాయకులు అనుమతి లేకుండా ఎగ్జిట్ మార్గం వైపు నుంచి లోపలికి రావడాన్ని జాయింట్ కలెక్టర్ గమనించారు. దీనిపై స్పందించిన ఆయన, ప్రజా సమస్యలు వినేందుకు నిర్వహించే ‘మీకోసం’ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సాధారణ ప్రజలతో సమానంగా నిర్ణయించిన ప్రవేశ మార్గం ద్వారానే రావాలని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ప్రత్యేక మార్గాలను ఉపయోగించడం సరికాదని, ఈ విషయంపై ఇప్పటికే బీజేపీ నాయకులకు అనేకమార్లు చెప్పిన పాటించడం లేదని అన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిబంధనలు పాటించాలని నాయకులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ప్రజలకు ప్రాధాన్యం ఇచ్చే ‘మీకోసం’ కార్యక్రమంలో అందరికీ సమాన అవకాశాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటారని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

## బాబు జగజీవన్ రామ్ కి ఘన నివాళులు



**విజయవాడ పశ్చిమ జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ నియోజకవర్గం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో.విజయవాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ కేశినేని శివనాథ్ చిన్ని క్యాంపు కార్యాలయంలో. డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా బాబు జగజీవన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షురాలు శ్రీమతి పైడిమాల సుభాషిని అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు. మహమ్మద్ ఫతావుల్లాహ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైనార్టీ సెల్ తెలుగుదేశం పార్టీ, పల్లె పోగు ప్రసాద్ తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎస్సీ సెల్ విజయవాడ పశ్చిమ నియోజకవవర్గం, పాలవాయి దాసు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పశ్చిమ నియోజకవర్గం, బి దాస్ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ, 35వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు బూదాల నంద కుమారి . లింగంపల్లి మోహన్ . ఎస్ కే బాజీ . తుపాకుల మల్లేశ్వర రావు, ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ. ఉప్పల దుర్గా, పట్నాల భార్గవి, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు.అభిమానులు కార్యకర్తలు. కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు- శాస్త్రవేత్తలు- వ్యవసాయ అధికారులు తో ముఖాముఖి కార్యక్రమం.



**జగ్గయ్యపేట జులై 6 (వార్తప్రభ)**సోమవారం, కె.వికె గరికపాడు నందు జిల్లా వనరులు కేంద్రం మరియు కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు సంయుక్తంగా ఎల్లినో మీద శిక్షణ కార్యక్రమాన్ని రైతులకి అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వనరు కేంద్రం నుండి డిడిఏ వెంకటేశ్వర్లు , ఏడిఏ మౌనిష జగ్గయ్యపేట ఏడిఏ భవాని , ఏవోలు రవి మరియు పద్మజా హాజరవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ ఎం రవి కిషోర్, సీనియర్ శాస్త్రవేత్త ,కేవీకే గరికపాడు వారు మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితుల్లో పంటలలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు నీటి సంరక్షణ పద్ధతులు గురించి వివరించారు. సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పిఎన్ శివప్రసాద్ మాట్లాడుతూ పత్తిలో మరియు కందిలో జీవన ఎరువులను వాడటం వలన వచ్చే ఉపయోగాలను మరియు అధిక సాంద్రత పత్తి లో ఉన్న ఉపయోగాలను రైతులకు తెలియజేశారు. డాక్టర్ ఎన్ రాజశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త , ప్రస్తుతం కందిలో మరియు పత్తిలో సస్యరక్షణ చర్యలు గురించి వివరించడం జరిగింది. భవాని ఏపీ ఎయిమ్స్ యాప్ గురించి, ఎరువులు నిల్వ గురించి, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ఎల్ నిను ఏర్పడినప్పుడు రైతులు మెట్ట పంటల మీద కూడా దృష్టి సారించాలని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు తమకు కావలసిన అవసరాలను మరియు ప్రశ్నలను ముఖాముఖి కార్యక్రమం లో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగింది. కార్యక్రమానికి కె వి కే శాస్త్రవేత్తలు ల తోపాటు మండల వ్యవసాయ అధికారులు హాజరవ్వడం జరిగింది.

## నిత్యాన్నదాన పథకమునకు విరాళం



**జగ్గయ్యపేట జులై 6(వార్తప్రభ)** మండలము తిరుమలగిరి గ్రామములో వేంచేసియున్న స్వయంభు శ్రీ వల్మీకోద్భవ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు జరుగుచున్న నిత్యాన్నదాన పథకమునకు ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రామిరెడ్డిపల్లి వాస్తవ్యులు శ్రీ కొత్త మోహనకృష్ణ జాగృతిదేవి దంపతులు రూ.10,116/– రూపాయలు విరాళముగా అందజేసియున్నారు. వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా సిబ్బంది శ్రీ స్వామి వారి ప్రసాదములు అందజేయుట జరిగినది అని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుమ్మా వెంకటేష్, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. రంగారావు తెలియజేసారు.

# జూలై 14లోపు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించండి

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ప్రతి ఓటరూ సహకరించాలి**
**సహాయం కోసం మీ బిఎల్ఓ ను సంప్రదించాలి**
**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**




**మచిలీపట్నం జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఓటర్ల జాబితాను సంపూర్ణంగా, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి కృష్ణా జిల్లా ఓటర్లందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. బీఎల్ఓల ద్వారా అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే నింపి తిరిగి అందజేయడం ద్వారా ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించవచ్చని ఆయన తెలిపారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు.క్షేత్రస్థాయిలో పర్యటించిన సందర్భంగా చాలామంది ఓటర్లు ఫారాలు తీసుకున్నప్పటికీ వాటిని తిరిగి సమర్పించడంలో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. జూలై 14వ తేదీలోపు అన్ని ఫారాలను డిజిటలైజ్ చేయాల్సి ఉన్నందున ప్రతి ఓటరు వెంటనే తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని సంబంధిత బీఎల్ఓకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.ఇంకా ఫారం అందని వారు తమ బీఎల్ఓను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే జశీవతీం.వ౩ఱ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ లేదా జుజ× చీజు యాప్‌లోని "దీశీశీని ఖ ఋశ్రీశ్రీ ఎఱ్ఞ్ర దీూ" సదుపాయం ద్వారా బీఎల్ఓతో నేరుగా సంప్రదించి ఫారం పొందడం, ఫారం నింపడంపై మార్గదర్శకత్వం, ఇతర అవసరమైన సహాయం పొందవచ్చని వివరించారు.ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచామని చెప్పారు. సందేహాలు ఉన్నవారు హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఓటర్లు తమ ఎపిక్ (జు౧×జ) నంబర్ ఆధారంగా జశీవతీం.వ౩ఱ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో స్వయంగా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఒక్క అర్హుడూ ఓటర్ల జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా చూడడమే ఎన్నికల సంఘం లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృష్ణా జిల్లా ప్రజలందరూ చురుకుగా భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కృష్ణా జిల్లా ఓటర్ల హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్లు జిల్లా కాల్ సెంటర్: 1950 ,కృష్ణా, మచిలీపట్నం: 8555824148

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ కు బిజెపి నాయకుల నివాళులు





**ఇబ్రహీంపట్నం, జులై 06(వార్తా ప్రభ ప్రతినిధి):** భారతీయ జన సంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బిజెపి నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. కొండపల్లి బిజెపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, ఆ పార్టీ సీనియర్ నాయకులు నూతులపాటి బాలకోటేశ్వర రావు (బాల) ఆధ్వర్యం జరిగిన ఈ కార్యక్రమం అనంతరం పార్టీ సర్వ సభ్య సమావేశం లో బూత్ సమస్యలు చర్చించారు. నూతనంగా పార్టీలో చే దామెర్ల నరసింహ రావు కు కండువా కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు దాము భవాని, సేనాపతి నాగమణి, సెక్రటరీ కృష్ణంరాజు ,కో ఆప్షన్ సభ్యురాలు షేక్ నగినా తదితరులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం రూరల్ బీజేపీ ఆధ్వర్యంలో కేతనకొండ గ్రామం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమం లో ఇబ్రహీంపట్నం రూరల్ మండలం బీజేపీ అధ్యక్షులు పయ్యావుల జయలక్ష్మి రాము దంపతులు,మండలం వైస్ ప్రెసిడెంట్ కొరవి శ్రీనివాసరావు,సీనియర్ నాయకులు పత్రి పుల్లయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయాలు, నైట్ వాచ్ మెన్ల వేతనాలు చెల్లించాలి



**ఇబ్రహీంపట్నం, జులై 6 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల ఆయా అండ్ నైట్ వాచ్ మెన్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో ఆయా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాలుగు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లు సర్వీస్ చేసిన వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించి రూ.2 లక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, కార్యదర్శి కొప్పుల కుమార్, నగర కార్యదర్శి రవీంద్ర నాయకులు శ్రీనివాసరావు, కోనేరు ఆంజనేయులు, కోటేశ్వరరావు, మహిళా సంఘం అధ్యక్షురాలు ఆసియా, ఆయా అండ్ శానిటేషన్ నైట్ వాచ్ మెన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కోనేరు లక్ష్మి, కార్యదర్శి కౌసల్య, వై.లక్ష్మి, మైము, ప్రేమ జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కమలా ప్రసన్న నగర్లో "లైఫ్ సెంటర్ ,లెవల్ అప్ జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్" ను లాంఛనంగా ప్రారంభించిన పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ...

**కూకట్ పల్లి జులై 6(వార్తాప్రభ):**వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు చేసిన "లైఫ్ సెంటర్ ,లెవల్ అప్ జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్" ను పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శారీరక, మానసిక, భావోద్వేగ, జీవనశైలి ఆరోగ్యాన్ని ఒకే వేదికపై అందించాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న లైఫ్ సెంటర్, లెవల్ అప్ జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్ ను ప్రారంభించడం అభినందనీయమని తెలియచేశారు.నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు, ఒత్తిడి, ఊబకాయం, వెన్నునొప్పి, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు కేవలం చికిత్స మాత్రమే కాకుండా నివారణ, పునరుద్ధరణ సమగ్ర జీవన విధానం అవసరమని పేర్కొన్నారు. అలాంటి సమగ్ర దృక్పథంతో ప్రతి వయస్సు వారికి అనువైన ఆరోగ్య సేవలను ఒకే చోట అందించే ఈ కేంద్రం సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలియచేశారు.లైఫ్ సెంటర్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది కేవలం జిమ్ మాత్రమే కాదనీ ఆరోగ్యాన్ని అన్ని కోణాల్లో సమగ్రంగా చూసే హోలిస్టిక్ హెల్త్ సెంటర్ అన్నారు. ముఖ్యంగా థెరప్యూటిక్ ఫిట్‌నెస్ పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రతి వ్యక్తి శారీరక స్థితి, వయస్సు, ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించబడుతుంది అన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ



శరీర దృఢత్వంతో పాటు మనశ్శాంతి, సమతుల్య జీవన విధానం మరియు ఆరోగ్య అవగాహనను పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆరోగ్య సంస్కృతి ఏర్పడాలనే సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త గోపాల్ బల్దేవా, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేని చంద్రకాంత్ రావు, గంధం రాములు, చంద్రమోహన్ సాగర్, శివ సాగర్, మల్లయ్య, కిషన్. కట్ట రవి, రాము, పరమేశ్వర్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వైద్యులు, ఫిట్‌నెస్ నిపుణులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు**
**ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్హులకు, చిన్నారులకు పోషకాహారం, ఆర్థిక సాయం పంపిణీ**



**జగ్గయ్యపేట జులై 6 (వార్తప్రభ)** నిరుపేద వర్గాల సంక్షేమానికి, పోషకాహార లోప నిర్మూలనకు నిరంతరం శ్రమిస్తున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సోమవారం జగ్గయ్యపేట పట్టణంలో కాకాని నగర్ లో ఉన్న ట్రస్ట్ కార్యాలయమలో నిర్వహించిన సేవా కార్యక్రమం లో పాల్గొన్నారు, అనంతరం పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు, వృద్దులకు ?10,000 (పది వేల రూపాయలు) విలువైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ శ్రీ రామానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో నిర్వహిస్తున్న పౌష్టికాహార పంపిణీ తో పాటు మానవతా దృక్పథంతో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఆర్థిక సహాయం అందచేస్తునట్టు తెలిపారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న షేక్ ఇమామ్ అనే వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం ?2,000 (రెండు వేల రూపాయల) చెక్కును అందజేశారు. అలాగే ప్రభావతి అనే మహిళకు ఆర్థిక ఆసరాగా మరో ?2,000 (రెండు వేల రూపాయల) చెక్కును అందజేసి ఆయా కుటుంబాలకు ధైర్యాన్ని నింపారు. ట్రస్ట్ ప్రతి మాసము క్రమం తప్పకుండా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు.సమాజ శ్రేయస్సుకై నిరంతరం సాగుతున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అత్యంత అభినందనీయమని హాజరైన పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, పట్టణ మున్సిపాలిటీ వింగ్ అన్నేపాక ప్రవీణ్, వేల్పుల ప్రసాదు, దారెల్లి రాజు, ట్రస్ట్ అడ్వైజర్ కారంగుల రామకృష్ణ , రాయపూడి వెంకటేశ్వరా రావు, డి రామచందర్, పి. శ్రీనివాస రావు, శ్రేయస్సు ప్రతినిధులు లక్ష్మి, ట్రస్ట్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# పేదల పల్లెంలో కందిపప్పు కరువు.. రేషన్ హామీలు గాలిలో కలిశాయా?

**బియ్యం, చక్కెరకే పరిమితమైన సరఫరా..**
**ప్రజలకు తప్పని ఇబ్బందులు**







**చంద్రగిరి:జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కల్పించాల్సిన రేషన్ వ్యవస్థలో కందిపప్పు, గోధుమపిండి కనిపించకపోవడంతో కార్డుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమపిండి వంటి నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు రేషన్ దుకాణాల ద్వారా అందిస్తామని ప్రకటించింది. అయితే ప్రస్తుతం చాలా రేషన్ దుకాణాల్లో బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తుండగా, కందిపప్పు, గోధుమపిండి జాడే కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు ధర కిలో రూ.150 వరకు ఉండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ప్రభుత్వం సబ్సిడీపై అందించే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్న కార్డుదారులకు "ఇంకా స్టాక్ రాలేదు" అనే సమాధానమే వినిపిస్తోందని వారు వాపోతున్నారు.కేవలం ఒక నెల మాత్రమే కందిపప్పు, గోధుమపిండి పంపిణీ చేసి, ఆ తర్వాత వాటి సరఫరాను నిలిపివేశారని పలువురు కార్డుదారులు చెబుతున్నారు. ఈ విషయంపై రేషన్ డీలర్లను ప్రశ్నిస్తే, "మాకు ఎంత వస్తే అంతే ఇస్తాం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.మరోవైపు, కొన్ని రేషన్ దుకాణాల్లో ప్రతి నెల 5వ తేదీకే బియ్యం, చక్కెర స్టాక్ అయిపోయిందని చెప్పి, ఇతర దుకాణాల నుంచి తీసుకోవాలని వృద్ధులు, మహిళలను పంపిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయాన్ని ప్రశ్నిస్తే, "మాకు తక్కువ స్టాక్ వచ్చింది" అని డీలర్లు సమాధానం ఇస్తున్నట్లు కార్డుదారులు తెలిపారు.అయితే చంద్రగిరి మండలంలోని కొన్ని పంచాయతీల్లో మాత్రం అన్ని రకాల రేషన్ సరుకులు అందుతున్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రమే కొరత నెలకొనడం పట్ల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి మండలంలోని అన్ని రేషన్ దుకాణాల్లో కందిపప్పు, గోధుమపిండి సహా అన్ని నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీ విధానంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తిస్థాయి ప్రణాళికలు

**మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**
**జాకీర్ హుస్సేన్ కాలేజ్ రోడ్ పనులను పరిశీలించిన చైర్మన్**



**ఇబ్రహీంపట్నం, జులై 06(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి పురపాలక సంఘం అభివృద్ధికి పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. సోమవారం నాడు ఇబ్రహీంపట్నం డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాలకు వెళ్లే రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.ఎన్నో ఏళ్లుగా రోడ్డు సరిగా లేకపోవడం, చిన్నపాటి వర్షం వచ్చిన చెరువుగా మారుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కొండపల్లి పురపాలక బోర్డు ఏర్పడిన తర్వాత చైర్మన్ చిట్టిబాబు దృష్టికి కౌన్సిలర్ అమ్మాజీ చిరుత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు మున్సిపల్ చైర్మన్. కమీషనర్ బి శ్రీనివాసరావు, ఏ ఈ మోస్మి గనియా తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే నుంచి రోడ్డును మెరక తోలి, రోడ్డు తో పాటు డ్రైనేజీని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.ఎంతో కాలం ప్రకాష్ నగర్, భీమరాజు గుట్ట ప్రాంతంలో నివసించే వారికి రోడ్డు సమస్య త్వరలోనే పరిష్కారం చూపుతుందని అన్నారు.కూటమి ప్రభుత్వం కొండపల్లి పురపాలక అభివృద్ధికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కృషి చేస్తున్నారని తెలిపారు.రానున్న రోజుల్లో కొండపల్లి పురపాలక అభివృద్ధికి ఎన్నో ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. పూర్తిస్థాయి అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం లో కొండపల్లి పురపాలక టిడిపి నాయకులు పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్ల ఆలోచనను విరమించుకోవాలి : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ డిమాండ్



**గన్నవరం, జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలోని పాఠశాలల్లో 'డొక్క సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని' స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి గండికోట సమ్మక్క డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క మాట్లాడు తూ ఈ పథకాన్ని ?ప్రైవేటీకరణ చేయడం వల్ల ?పిల్లలు నాణ్యమైన, పోషకాలు కలిగిన వేడి భోజనానికి దూరం అవుతారని అన్నారు. స్మార్ట్ కిచెన్ల వల్ల ఎక్కడో వంట చేసి స్కూళ్లకు బాక్సుల్లో పంపడం వల్ల విద్యార్థులు ఆహారానికి దూరం అవుతారని,ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ప్రైవేట్ సంస్థలు అందిస్తున్న చల్లటి, నాసిరకం భోజనాన్ని పిల్లలు తినలేక పారేస్తున్నారని పేర్కొన్నారు.?అంతే కాకుండా ఈ నిర్ణయం వల్ల ఇప్పటివరకు సేవలందిస్తున్న నిరుపేద మహిళలు తమ ఉపాధిని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లోనే వేడివేడి ఆహారం వండి పెట్టాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. ఇదే విధానం కొనసాగితే కార్మికుల ఆగ్రహం చవిచూడవలసి వస్తుంది అని అన్నారు. అనంతరం సమస్య లతో కూడిన వినతిపత్రం మండల రెవెన్యూ అధికారికి అందించారు. ఈ కార్యక్రమం లో సిఐటియు మండల కన్వీనర్ బి తాతబ్బాయి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లజర్ల పద్మ కుమారి, మల్లంపల్లి లలిత కుమారి, కోశాధికారి జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, పాండురంగమ్మ, వసుమతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మంగళవారం మియాపూర్ లో సంత నిర్వహణకు అనుమతి మంజూరు



**శేరిలింగంపల్లి,జూలై 6 (వార్తాప్రభ):**మియాపూర్ మంగళవారం సంత నిర్వహణకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారిక అనుమతి మంజూరు చేసింది. దీంతో రేపటి నుంచి ప్రతి మంగళవారం సంత యథావిధిగా కొనసాగనుంది.ఈ సందర్భంగా అనుమతుల మంజూరులో సహకరించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు రవికుమార్ యాదవ్, సీఎంసీ కమిషనర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు మార్కెట్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి లో ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు...

**నివాళులర్పించిన బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు...**



**కూకట్ పల్లి, జూలై 6(వార్తాప్రభ):** డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లిలోని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశభక్తుడు, విద్యావేత్త, దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. భారతదేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు" అనే నినాదంతో దేశ సమగ్రత కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని, దేశాభివృద్ధి, జాతీయవాదం కోసం ఆయన చూపిన మార్గంలో నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్రీనివాస్ గౌడ్, అనంత నాగరాజు, నర్సింగ్,గోపాల్ రావు, దుర్గాప్రసాద్ రావు, శంకర్ రెడ్డి, సాయి, రమణారెడ్డి, మంజునాథ్, శేఖర్ రావు, రాఘవేందర్, దారా సాయి తదితరులు పాల్గొన్నారు.

# జోగివి దిగజారుడు రాజకీయాలు - టీడీపీ నేతల విమర్శ



**ఇబ్రహీంపట్నం, జులై 6 (వార్తా ప్రభ ప్రతినిధి ):** మాజీ మంత్రి జోగి రమేష్ ఛీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నారని కొండపల్లి పట్టణ టీడీపీ నాయకులు విమర్శించారు. ఇబ్రహీం పట్నం లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. టీడీపీ నేతలు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను ఉద్దేశించి జోగి రమేష్ వైసీపీ కేడర్ వద్ద చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో ప్రచారం చేయించడాన్ని ఖండించారు. సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే వసంత వ్యక్తిత్వం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు, మాజీ మంత్రి జోగి రమేష్ కు లేదన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువగానే కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. జోగి రమేష్ ఛీప్ ట్రిక్స్ మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కారుమంచి దుర్గారావు, రావి ఫణి, మైలా సైదులు తదితరులు పాల్గొన్నారు.

## "జీవో 396తో దస్తావేజుల వ్యవస్థకు ముప్పు..!

**పీపీపీ విధానంపై భగ్గుమన్న డాక్యుమెంట్ రైటర్లు"**



**చంద్రగిరి జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):**రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో పబ్లిక్--ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అమలు చేయడం వల్ల ప్రజలకు న్యాయపరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని దస్తావేజు రచయితలు, స్టాంప్ వెండర్లు, అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఎన్నో దశాబ్దాలుగా చట్టబద్ధంగా, న్యాయపరంగా ప్రజలకు సేవలందిస్తూ తమ కుటుంబాలను ఈ వృత్తిపైనే ఆధారపడి పోషించుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల వేలాది మంది దస్తావేజు రచయితలు, స్టాంప్ వెండర్లు, సహాయకులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఇప్పటివరకు ప్రజలకు పారదర్శకంగా, చట్టబద్ధంగా సేవలు అందిస్తోందని, అలాంటి వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు మళ్లించడం వల్ల ప్రజల ఆస్తులకు సంబంధించిన దస్తావేజుల భద్రత, న్యాయపరమైన హక్కులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దస్తావేజులు చట్టబద్ధంగా, సక్రమంగా నమోదు అయినప్పుడే స్థిరాస్తులపై యాజమాన్య హక్కులు శాశ్వతంగా రక్షితంగా ఉంటాయని గుర్తు చేశారు.ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396 అమలైతే తమతో పాటు ప్రజలు కూడా అనేక న్యాయపరమైన, పరిపాలనా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీవోను వెంటనే రద్దు చేసేలా ప్రభుత్వానికి తమ విజ్ఞప్తిని తెలియజేయాలని సబ్ రిజిస్ట్రార్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో దస్తావేజు రచయితల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు సి.ఎం. కేశవులు, డాక్యుమెంట్ రైటర్లు ఎల్. గోపి, పి. శ్రీనివాస కుమార్, సుబ్రహ్మణ్యం నాయుడు, శ్రీకాంత్, చంద్ర, శిరీష, మల్లికార్జున్, ఉషారాణి, టి.సి. నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యత కోసం ముఖర్జీ త్యాగాలను స్మరించుకున్న బిజెపి నేతలు..

● ఆటో నగర్ లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు..




**గుడివాడ,జూలై 6 (వార్తాప్రభ) :** స్థానిక ఆటో నగర్ లోని బిజెపి నాయకులు లింగం చిట్టిబాబు కార్యాలయంలో స్వర్గీయ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. బిజెపి నాయకుడు లింగం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆటోనగర్ లో జరిగిన వేడుకల్లో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముందుగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించిన నాయకులు, జయంతి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ సమైక్యత, అఖండత కోసం శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం చిరస్మరణీయమని అన్నారు. జమ్మూ కాశ్మీర్ ను దేశంలో విలీనం చేయడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ముఖర్జీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే బిజెపి కార్యకర్తల లక్ష్యమని, దేశ భద్రత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, ఆర్ కె, బిజెపి జిల్లా నాయకులు అంగడాల సతీష్, బోనం గోపిక తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో, వైద్య సిబ్బందిలో అగ్ని భద్రతపై అవగాహన పెంపు

● గుడివాడ అగ్నిమాపక కేంద్రం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం




**గుడివాడ,జూలై 6 (వార్తాప్రభ) :**అగ్నిప్రమాదాల పట్ల ప్రజల్లో అప్రమత్తత పెంపొందించడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణనష్టం మరియు ఆస్తి నష్టాన్ని నివారించడం లక్ష్యంగా గుడివాడ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రెండు విద్యాసంస్థలు మరియు ఒక ప్రభుత్వ వైద్య కేంద్రంలో ప్రత్యేక అగ్ని భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెంట్రప్రగడ, ఎస్.ఆర్.ఆర్. & వి.సి.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వానపాముల, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంట్రప్రగడలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, సిబ్బందికి అగ్ని భద్రతపై సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణలో అగ్నిప్రమాదాలకు దారితీసే ప్రధాన కారణాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఎల్పీజీ గ్యాస్ లీకేజీ, అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భవనం నుంచి సురక్షితంగా బయటకు వెళ్లే విధానం, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల సరైన వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా నియమలు వివరించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లతో ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, వాటి వినియోగంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందికి ప్రాక్టికల్ శిక్షణ అందించారు.

## గుడివాడ ప్రభుత్వ పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ డే

-220 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్




**గుడివాడ,జూలై 6 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్ వేశారు. వెటర్నరీ శాఖ ఏ.డి డా. పి.రత్నశ్రీ కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేసి కార్య క్రమాన్ని ప్రారంభించారు. నేడు వైద్యశాల ప్రాంగణంలో నిర్వహించిన జునోసిస్ డే సందర్భంగా 220 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు ఏడీ రత్నశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా డా. రత్నశ్రీ మాట్లాడుతూ.. జూనోసిస్ అనేది జంతువుల నుండి మనుష లకు సంక్రమించే వ్యాధులని, వీటిలో రేబిస్ అత్యంత ప్రమాదకరమని అన్నారు. పెంపుడు జంతువులకు ప్రతి ఏడాది తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని, శుభ్రత పాటించాలని సూచించారు. పశువులకు వచ్చే సంక్రమిత వ్యాధులపట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు తీసుకురావాలని డాక్టర్ రత్నశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు, పశువైద్యశాల సిబ్బంది, పశుపోషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనర్ బాలిక పై వృద్ధుడు అత్యాచార యత్నం

● స్థానికులు చూసి వృద్ధుడు కీ దేహశుద్ధి.. పోలీస్ స్టేషన్ కీ తరలింపు.....

● పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు..........



**పెనుగంచిప్రోలు,జూలై 6 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల పరిధిలో ని నవాబుపేట గ్రామం లో మైనర్ బాలిక పై వృద్ధుడు అత్యాచార యత్నం చేసిన సంఘటన సోమవారం మధ్యా హ్నం చోటు చేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలిక ఇంటి పక్కన నివాసం ఉంటున్న వృద్ధుడు ఫోన్ ఇస్తాను అన్ని మాయమాటలు చేపి తన ఇంటి లోని బాత్ రూమ్ లోనికి తీసుకోని వెళ్లి అత్యా చారం చేయడానికి ప్రయత్నం చేయగా, బాలిక బయపడి కేకలు వేయడం తో చుట్టు పక్కల వారు గమనించి వృద్ధుడి కీ దేహ శుద్ధి చేసి స్థానిక పోలీసు లకు అప్పగించారు.జరిగిన సంఘటన పై స్థానిక ఎస్ ఐ అర్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపు న్నారు

## లీ ఫార్మా, లీ హెల్త్ డొమైన్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం

● వైద్య శిబిరానికి విశేష స్పందన ● లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి







**విశాఖపట్నం,జూలై 6 (వార్తాప్రభ) :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా ఎముకలు, కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పోషకాహారం, క్రమమైన వ్యాయామం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి సూచించారు. దువ్వాడ ఫేజ్--2లోని రాజీవ్ నగర్‌లో ఉన్న కుసుమ హరినాథ్ ఆశ్రమం సహకారంతో లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తుల కోసం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించగా, సుమారు 100 మంది భక్తులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పొందారు. శిబిరంలో భాగంగా ఆంత్రోపోమెట్రిక్ కొలతలు, హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్ (చేతి పట్టు బలం), బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), హిమోగ్లోబిన్ (హెచ్‌బీ), రాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్), రక్తపోటు (బీపీ), బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ), బాడీ కాంపోజిషన్ అనాలిసిస్ తదితర పరీక్షలను నిర్వహించారు. అనంతరం వైద్యులు, పోషకాహార నిపుణులు పరీక్షల నివేదికలను పరిశీలించి, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులపై వ్యక్తిగత కౌన్సెలింగ్ అందించారు. ఈ సందర్భంగా ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ, ఎముకలు, కీళ్ల దృఢత్వానికి నాణ్యమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయడం అత్యంత అవసరమని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణను లక్ష్యంగా చేసుకుని లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తూ, అవసరమైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, ఉచిత మందులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, వైద్యురాలు డాక్టర్ రాధిక, పోషకాహార నిపుణులు మాధురి, క్రాంతి, భాగ్యలత, యోగా మాస్టర్ అఖిల్, లీ ఫార్మా సిబ్బంది, కుసుమ హరినాథ్ ఆశ్రమం అధ్యక్షుడు బి. బాబాజీ, రమేష్, శేఖర్‌తో పాటు ఆశ్రమ బృంద సభ్యులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ శిబిరంలో ఎఎన్ఆర్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



**గుడివాడ,జూలై 6 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు బి. మహేష్ బాబు మరియు పి. నాగ సంజన 2026 జూన్ 24 నుండి జూలై 5 వరకు కె.ఎల్. డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాడెట్లు సాంస్కృతిక మార్పిడి, జాతీయ సమగ్రత, పరస్పర అవగాహన వంటి అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో చురుకుగా పాల్గొనడం తమ కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన అన్ని ఎన్‌సీసీ బెటాలియన్ల క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొని జాతీయ ఐక్యతను పెంపొందించే పలు కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. శిక్షణా శిబిరంలో భాగంగా క్యాడెట్లు మంగళగిరి లోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, విజయవాడ లోని ధ్యాన బుద్ధ విగ్రహం, అమరావతి లోని అమరలింగేశ్వర స్వామి దేవాలయం, అమరావతి స్తూపాలు, బాపట్ల లోని సూర్యలంక బీచ్, ఉండవల్లి గుహలు తదితర చారిత్రక, పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్శనలు క్యాడెట్లలో చారిత్రక, సాంస్కృతిక అవగాహనను పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్. కె. ప్రసాద్ మరియు కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ కె. ఎస్. అప్పారావు తెలియజేసారు శిబిరంలో విజయవంతంగా పాల్గొన్న క్యాడెట్లను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ మరియు ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం.డి. సలీం అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి

● జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించిన డిఎస్పి పాల శ్రీనివాస్, కమిషనర్ మనోహర్, పట్టణ ప్రముఖులు..

**గుడివాడ,జూలై 6 (వార్తాప్రభ) :** దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్మిక నగర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో గుడివాడ డిఎస్పి పాల శ్రీనివాస్, కమిషనర్ మనోహర్, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొని ప్రధాన రహదారిలో గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాస్, కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ దళిత, బడుగు బలహీన, పేద వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరం ఆదర్శంగా తీసుకోవాలని, సమాజంలో సమానత్వం, సామరస్యం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. బాబు జగ్జీవన్ రామ్ దేశ రక్షణ, వ్యవసాయ, కార్మిక రంగాల్లో చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువత ఆయన బాటలో నడిచి దేశ సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కంచర్ల సుధాకర్, పొంగులేటి జయరాజు, వస్టైన్ సి ఏ



శ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు ఉప్పలపాటి ఆశీర్వాదం, సామాజికవేత్త దండమూడి సీతారామస్వామి, బిజెపి నాయకులు అంగడాల సతీష్, టిడిపి నాయకులు వసంతవాడ దుర్గారావు, రెడ్డి షణ్ముఖ, జనసేన నాయకులు కొదముల గంగాధర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక సంస్థల పెద్దలు పాల్గొన్నారు.

## అక్షర రత్న జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న "సత్యం మాస్టారు"




**పెనుగంచిప్రోలు, జూలై 6 (వార్తాప్రభ) :** విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయ సదస్సులో పెనుగంచిప్రోలు కు చెందిన మాస్టారు ముక్కా సత్యనారాయణ మరో జాతీయ అవార్డు అందుకున్నారు. స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సత్యనారాయణను తాను చేసిన సాహిత్య సేవలకు గాను శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, శ్రీనాథుని వంశీకులు కానూరు శ్రీనివాస శర్మ అక్షర రత్న బిరుదుతో ఘనంగా సత్కరించారు. రెండు వందల పైగా కవులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అక్షర రత్న బిరుదు అందుకొన్న పదిహేను మందిలో ఒకడిని అయినందుకు ఆనందంగా ఉందని సత్యం మాస్టర్ సంతోషం వ్యక్తం చేశారు. కవి సార్వభౌముడు శ్రీనాధుని వంశీయుడైన శ్రీనివాస్ శర్మని కలుసుకోవడం , ప్రతిష్టాత్మకమైన సంస్థ శ్రీ శ్రీ కళావేదిక పురస్కారం తీసుకొనడం మరిచిపోలేని అనుభవం అన్నారు. గత వారంలో ఐదు వందల పంచపదులు రాసినందుకు పంచపది కవిరత్నం, రామదాసు సాహితీ సంస్థ పంచ శత సాహితీ రత్న, షట్శత కవి విభూషణ బిరుదులు ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణను రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రచయితలు అభినందించారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం, దుప్పట్లు, పండ్లు పంపిణీ





**గుడివాడ,జూలై 6 (వార్తాప్రభ) :** వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో డిస్టిక్ కో -ఆర్డినేటర్ శేగు బబిత కీర్తిశేషులు అయిన వారి తల్లిదండ్రులు బైసాని రాధా వెంకటేశం, స్వరాజ్యం దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు సహకారంతో శాంతి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి తదుపరి దుప్పట్లు పళ్ళు వృద్ధులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈరోజు తన అత్తామామల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు చేస్తున్న కార్యక్రమాన్నికి అభినందనలు తెలియజేశారు. మన ఇళ్లలో పుట్టినరోజులు, పెళ్లిరోజులు, జయంతులు, వర్ధంతులు. ఇలాంటివి జరిగినప్పుడు అది వృద్ధుల సమక్షంలో గనక మనం చేసుకోవడం మనకు ఎంతో తృప్తిని ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ కోఆర్డినేటర్ గాదె మోహన్ బాబు కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు యువతకు ఆదర్శం: నల్లా పవన్ కుమార్




**అమలాపురం,జూలై 6 (వార్తాప్రభ) :** జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సోమవారం అమలాపురం జిల్లా బీజేపీ కార్యాలయంలో అమలాపురం పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయత భావాలను బలోపేతం చేయడంలో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ పాత్ర విశిష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ చెరుకూరి గోపి,మాజీ పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, కార్యాలయ ఇన్‌చార్జ్ డీవీఎస్ రాజు, మన్నె రామదాసు,సంసాని రత్నకుమార్,పావులూరి వెంకట్, బొచ్చ ప్రభాకర్,మహబూబ్ షహీరా,అరిగెల తేజా వెంకటేష్, పెద్దిరెడ్డి శ్రీనివాస్,దాకే వెంకటరావు ,రావూరి వెంకటేశ్వరావు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామసభకు విచ్చేసిన కాపా శ్రీనివాసరావు




**నూజివీడు,జూలై 6 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం రావిచర్ల గ్రామపంచాయతీ నందు ప్రత్యేక అధికారి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించడం జరిగినది ఈ గ్రామ సభలో (PMAY) ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా గృహాలు నిర్మించుకునే వారికి రెండు లక్షల 39 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో జుః సర్పంచ్ శ్రీ కాపా శ్రీనివాసరావు గారు హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామోజీ నాయక్ గారు,ూ .జు నవీన్ గారు, పంచాయతీ కార్యదర్శి పి. వినోద్ కుమార్ గారు మరియు సచివాలయ అధికారులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో జుః సర్పంచ్ మరియు జుః ూవీజ చైర్మన్ అయినటువంటి శ్రీకాపా శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ రావిచెర్ల గ్రామంలో గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చే 2 లక్షల39 వేల రూపాయలకు అదనంగా దీ. జ లబ్ధిదారులకు 20,000 మరియు ూజ లబ్ధిదారులకు 30 వేల రూపాయలు తన సొంత ఖర్చులు ఇస్తానని శ్రీకాపా శ్రీనివాసరావు గారు ఈ గ్రామ సభలో చెప్పడం జరిగినది. ప్రస్తుత లబ్ధిదారుల జాబితాను గ్రామ సచివాలయం నందు పెట్టడం జరిగినది.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



**జి.కొండూరు,జూలై 6 (వార్తాప్రభ) :** స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. గిరిజామణి ఆధ్వర్యంలో సోమవారం జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు సైబర్ నేరాలపై స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ గిరిజామనణి మాట్లాడుతూ అనేక విధములుగా జరుగుతున్న సైబర్ నేరాలు అనగా ఓ టి పి ఫ్రాడ్స్, లోన్ యాప్ ఫ్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, బెట్టింగ్ యాప్‌లు,ఏ పి కె ఫైల్స్, డిజిటల్ అరెస్ట్, లాటరీల పేరుతో మోసాలు, ఆన్‌లైన్‌లో సగం ధరకే వస్తువుల పేరిట మోసాలు వంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. లింక్‌లు, ఏపీకే ఫైల్ లు క్లిక్ చేయకూడదన్నారు. తెలియని వ్యక్తులతో ఓ టి పి , బ్యాంక్ వివరాలు పంచుకోరాదని, ఆ నేరాల గురించి తెలియచెప్తూ ఒక్కో నేరం జరిగే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్త లు గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించా రు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బును సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి నష్టపోతున్నార ని, ఆ కష్టార్జితాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి బాధితులు అయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సదరు కార్యక్రమంలో జి.కొండూరు పోలీస్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బంటుమిల్లి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎంపీపీ...



**కృత్తివెన్ను,జూలై 6 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం నాగేశ్వరరావు పేట పంచాయతీ పరిధిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చిన బాబు హాస్పిటల్ లో అన్ని వ్యాక్సిన్లు అందుబాటులో ఉండాలని సిబ్బంది కూడా హాస్పటల్ లో అందుబాటులో ఉండాలని ఎంపీపీ సూచించారు అనంతరం హాస్పిటల్ లో ఉన్న మెడికల్స్ ను పరిశీలించారు ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను మండలం నుండి ఇన్చార్జిగా ఉన్న డాక్టర్ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# ఎర్రగడ్డపాటి రణక్షేత్రంలో అక్షర యజ్ఞం.. 'యాదవ వీర భారతం' గ్రంథ ఆవిష్కరణ






**కందుకూరు,జూలై 6 (వార్తాప్రభ) :** యాదవ జాతి వీరత్వానికి, త్యాగానికి నిదర్శనమైన ఎర్రగడ్డపాటి రణక్షేత్రంలో మరియు పాలేటి గంగమ్మ తల్లి సన్నిధిలో, అత్యంత పవిత్రమైన రీతిలో 'యాదవ వీర భారతం - కాటమరాజు చరిత్ర' పుస్తకాన్ని అమ్మవారికి మరియు శ్రీ కాటమరాజు స్వామి వారికి కైంకర్యం చేసి, ఘనంగా సమర్పించడం జరిగింది. ఈ చారిత్రక ఘట్టంలో భాగంగా, యాదవ వంశానికి చెందిన మూడు తరాల పూజారులు పాలేటి గంగమ్మ వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అమ్మవారికి పుస్తక కైంకర్యం జరిపించారు. అనంతరం భక్తులు, ప్రముఖుల సమక్షంలో వైభవంగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఏ పి.ఎం.పి. ఏ. రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ ఈ 'యాదవ వీర భారతం' కేవలం అక్షరాల కూర్పు కాదని. ఎనిమిది వందల ఏళ్లుగా జానపదుల గుండెల్లో, కమ్మూ వాయిద్యాల శబ్దాల్లో మారుమ్రోగుతున్న మన పూర్వీకుల వీరగాథలకు ఇది అక్షర రూపమని. వై.ఎస్. యాదవ్ తన తండ్రిగారి అసంపూర్ణ స్వప్నాన్ని, యాదవ జాతి ఆత్మగౌరవ ప్రతీకగా మలచడం అభినందనీయమని అన్నారు.అఖిల భారత యాదవ మహాసభ సెక్రటరీ జనరల్ సెక్రెటరీ దొడ్డక ఆంజనేయ మూర్తి మాట్లాడుతూ ఏ నేల మీదైతే మన వీరులు ధర్మం కోసం, గోసంరక్షణ కోసం తమ నెత్తుటిని చిందించారో... ఆ ఎర్రగడ్డపాటి రణక్షేత్రంలో, పాలేటి గంగమ్మ తల్లి సాక్షిగా ఈ పుస్తకాన్ని సమర్పించడం సముచితమని, ఇది కేవలం పుస్తకావిష్కరణ కాదు, మన మూలాలకు మనం చేస్తున్న వందనమని అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షులు బోట్ల రామారావు యాదవ్ మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతంలో కాటమరాజు జరిపిన సమరం చారిత్రాత్మకమైనదని. ఆ ప్రాంతానికి 'కాటమరాజు జిల్లా'గా నామకరణం చేయాలనేది ఈ జిల్లావాసుల చిరకాల వాంఛ అని, ఈ పుస్తకం ఆ పోరాటానికి బలమైన చారిత్రక ఆధారాలను అందిస్తుందని. మన చరిత్రను మనము గౌరవించుకుంటేనే, రేపటి తరం మనల్ని గుర్తుంచుకుంటుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ రచయిత వై.ఎస్. యాదవ్ మాట్లాడుతూ, యాదవుల వీరత్వాన్ని, త్యాగాలను అక్షర బద్ధం చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను సగర్వంగా అందిస్తున్నా మని, ఈ పుస్తకం త్వరలో ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఆన్లైన్ స్టోర్లలో అందుబాటులోనికి వస్తాయని, లేదా 8374096999 నెంబర్ నందు సంప్రదించిన కొరియర్ ద్వారా పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోర్నాల ఎంపీపీ పద్మజ యల్లేష్ యాదవ్, సీనియర్ న్యాయవాది భారతాల మల్లికార్జునరావు యాదవ్, పాలేటి గంగమ్మ ఆలయ కైంకర్యదారులు, కాటమరాజు చరిత్ర పరిశోధకులు వేణు యాదవ్, సన్నిబోయిన గంగాధర్ యాదవ్, పాలెం శేషంరాజు యాదవ్, వినోద్ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డా.విజయశ్రీ రొడ్డ ( బుజ్జమ్మ) కి స్తంబాద్రి స్ఫూర్తి పురస్కారం




**విజయవాడ,జూలై 6 (వార్తాప్రభ) :** రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవచేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న సంఘ సేవకురాలు రొడ్డా విజయశ్రీని లలితా కళా సమాఖ్య మొగిలి ఎంటర్టైన్మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఖమ్మం లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో స్తంబాద్రి స్ఫూర్తి పురస్కారం 2026 అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ ఈ అవార్డు తనకు 29 వ అవార్డు అని ఈ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తనకు అవార్డు అందజేసిన మొగలి,నాగసాయి కి ధన్యవాదాలు తెలిపారు.

# దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా స్థిరపడాలి-యార్లగడ్డ

● మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణి




**మైలవరం,జూలై 6 (వార్తాప్రభ) :** దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా స్థిరపడాలని మైలవరం సబ్ రిజిస్ట్రార్ యార్లగడ్డ నరసింహారావు అన్నారు.మైలవరం మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు ఆశజ్యోతి (యు ఎస్ ఎ),పాలడుగు వంశీకృష్ణ, శ్రీపద్మ అర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల పంపిణి కార్యక్రమాన్ని స్థానిక ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యార్లగడ్డ నరసింహారావు, ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ తో కలిసి 48 కుట్టు మిషన్లు మహిళలకు అందజేశారు.ఈ సందర్బం గా యార్లగడ్డ మాట్లాడుతూ మహిళల ఆర్దిక స్వాలంబనకు శిక్షణతో పాటు దాతలు వారికి కుట్టుమిషన్లు కూడ అందించడం హర్షనీయం అన్నారు.కుట్టు మిషన్ల శిక్షణ మహిళల జీవనోపాధికి ఎంతగానో దోహాలు పడుతుందని పేర్కొన్నారు.అర్థికసాయం అందజేసిన ఆశజ్యోతి వంశీకృష్ణ ,శ్రీపద్మ లకు ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ, మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటేశ్వరావు, జూలూరు రాము, కోయ శ్రీనివాస్, విజయలక్ష్మి, ఉష, షహెధ పాల్గొన్నారు.

# రొయ్యల ఫ్యాక్టరీని తొలగించి చినగొల్లపాలెం గ్రామానికి మోక్షం కలిగించండి.... గ్రామస్తులు ఆవేదన



**కృత్తివెన్ను,జూలై 6 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండల పరిధిలోని చినగొల్లపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న ఆక్వా రొయ్యల ఫ్యాక్టరీ యూనిట్‌ను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం యూనిట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ రొయ్యల ఫ్యాక్టరీ నుండి విడుదలవుతున్న వ్యర్థ జలాల (వేస్టేజ్ వాటర్) కారణంగా చిన గొల్లపాలెం గౌడ పాలెం వద్ద భరించలేని దుర్వాసన వ్యాపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే మురుగు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రాసెసింగ్ యూనిట్‌ను నివాసాల మధ్య ఏర్పాటు చేయడానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని గ్రామస్తులు ప్రశ్నించారు. యూనిట్ వద్ద సంస్థ పేరు లేదా వివరాలు తెలిపే బోర్డు కూడా లేకపోవడంతో ఇది అధికారిక అనుమతులతో నిర్వహిస్తున్నారా లేదా అనధికారికంగా నడుపుతున్నారా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. గతంలో మూడు నుంచి నాలుగు సార్లు అమోనియా లీకేజీ జరిగిన సందర్భాల్లో యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికులు బయటకు పరుగులు తీశారని, భవిష్యత్తులో పెద్ద ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని గ్రామస్తులు ప్రశ్నించారు. అలాగే యూనిట్‌కు సమీపంలో దుర్గమ్మ ఆలయం ఉందని, అక్కడికి వ్యర్థ జలాలు చేరడం వల్ల భక్తులు ఆలయానికి రావడానికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీంతో ఆలయ పవిత్రత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని యూనిట్‌కు ఉన్న అనుమతులు, కాలుష్య నియంత్రణ నిబంధనల అమలును పరిశీలించాలని, నివాస ప్రాంతంలో నడుస్తున్న ఈ ప్రాసెసింగ్ యూనిట్‌ను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు

# వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వరి రైతులకు అవగాహన సదస్సు



**కోడూరు,జూలై 6 (వార్తాప్రభ) :** కోడూరు మండలం సాలెంపాలెం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ ) ఆధ్వర్యంలో రైతులకు , వరి లో మేలైన యాజమాన్యం పద్ధతులు గురించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం గురుంచి రైతులకు వివరించారు, తక్కువ కాలం గల మధ్యస్త అధిక దిగుబడి ఇచ్చే వరి రకాలను రైతులు పండించాలని, సస్యరక్షణ చర్యలను చేపట్టాలని వివరించారు, వ్యవసాయ సహాయసంచాలకులు అవనిగడ్డ జే.ఎస్ జయప్రద మాట్లాడుతూ, రైతులు డిఏపీ కి ప్రత్యానయంగా ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా సింగల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా కాంప్లెక్స్ ఎరువులు వినియోగించాలని వివరించారు , విత్తన గుళికలు తయారు చేసుకోని చళ్ళు కోవాలని , నీటి యాజమాన్యం పద్ధతులు పాటించాలని , L ఆకారం గాట్లు చేసుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కోడూరు యం శ్రీధర్ మాట్లాడుతూ,రైతులకు ,RSఖ లలో ఎరువుల కార్డు మరియు ఎరువుల యాప్, ఎరువుల లభ్యత గురించి వివరించారు. మండల ఉద్యాన అధికారి కోడూరు శ్రీ ఎన్. రమేష్ గారు మాట్లాడుతూ ఉద్యాన పంటల యాజమాన్యం మరియు ఉద్యాన పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రీమతి డీ రామతులసి మరియు రైతులు పాల్గొన్నారు.

# "దళిత బిడ్డ" నాగేశ్వర రావు కు నివాళ్లులు అర్పించిన నాయకులు,ప్రజలు




**పెనుగంచిప్రోలు,జూలై 6 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో తూర్పు బజారు దళిత వాడ లోని "దళిత బిడ్డ" గుర్రాల నాగేశ్వరరావు గుండె నొప్పి తో మృతి చెందగా వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,దళిత నేత వేల్పుల రవికుమార్, పెనుగంచిప్రోలు మండల ప్రెస్ క్లబ్ కార్యదర్శి దళిత నేత బోళ్ల రవికుమార్ లు మృతి చెందిన గుర్రాల నాగేశ్వర రావు మృత దేహంవద్దకు వెళ్లి దేహం పై పూల మాలలువేసి ఘనంగా నివాళ్లులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేశ్వర రావు మృతి చాలా బాధాకరం, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు..ఈ కార్యక్రమంలో గుర్రాల గోపి, గుజర్ల పూడి ఉదయ బాబు, గుర్రాల బుల్లిబాబు,వీఆర్వో ప్రకాష్ రావు,రాజు, చిరంజీవి,తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా కేంద్ర సహకార శాఖ ఐదవ వార్షికోత్సవాలు..

● 'సహకార్ సే సమృద్ధి' జాతీయ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్.




**మచిలీపట్నం,జూలై 6 (వార్తాప్రభ) :** న్యూఢిల్లీలోని భారత్ మండపం, ప్రగతి మైదాన్ వేదికగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "సహకార్ సే సమృద్ధి -- 5 స్వర్ణిమ్ సంవత్సరాలు: విజయాలు, నవకల్పనలు, వికసిత్ భారత్ దిశగా అడుగులు" అనే అంశంపై జాతీయ స్థాయి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. కేంద్ర హోం వ్యవహారాలు మరియు సహకార శాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై, సహకార రంగంలో గత ఐదేళ్లలో సాధించిన విజయాలను వివరించడంతో పాటు పలు జాతీయ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు (ఆప్కాబ్) చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట రామకృష్ణ, రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల (డిసిసిబి లు) చైర్మన్లతో కలిసి మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సహకార ధాన్య నిల్వ (గ్రైన్ స్టోరేజ్) పథకం కింద మొత్తం 75,000 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో 135 ఆధునిక గోదాములను రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రారంభించారు. ఈ గోదాములు రైతులకు పంట నిల్వ, మార్కెటింగ్, విలువ ఆధారిత సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు దోహదపడనున్నాయి. అదేవిధంగా సహకార రంగాన్ని ఆధునీకరించే లక్ష్యంతో నేషనల్ కోఆపరేటివ్ డేటాబేస్ (ఎన్ సి డి) 3.0, జియో-ట్యాగ్ మొబైల్ యాప్, ఎన్డిడిబి మిల్క్ సప్లై మానిటరింగ్ డ్యాష్‌బోర్డ్, సహకార్ సిబిఎస్, సహకార్ సహయోగి (కృత్రిమ మేధస్సు ఆధారిత వేదిక), భారతీయ బీజ్ సహకారి సమితి టిష్యూ కల్చర్ కేంద్రాలు వంటి పలు డిజిటల్, మౌలిక సదుపాయాల కార్యక్రమాలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సహకార రంగానికి కొత్త దిశను చూపిందని అన్నారు. కేంద్ర హోం మరియు సహకార శాఖ మంత్రి అమిత్ షా దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు సహకార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికంగా బలోపేతం చేయడంతో పాటు రైతు కేంద్రితంగా తీర్చిదిద్దుతున్నాయని కొనియాడారు. దేశవ్యాప్తంగా పిఎసిఎస్,జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డిసిసిబి లు), రాష్ట్ర సహకార బ్యాంకులను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సహకార ధాన్య నిల్వ పథకం, డిజిటల్ సేవల విస్తరణ, పారదర్శక పాలన వంటి కార్యక్రమాలు రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చడంతో పాటు "సహకారం ద్వారా సమృద్ధి -- వికసిత్ భారత్" లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని నెట్టెం శ్రీ రఘురాం అన్నారు. దేశవ్యాప్తంగా రాష్ట్ర సహకార బ్యాంకుల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ప్రతినిధులు, సహకార సంఘాల నాయకులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. "సహకారం ద్వారా సమృద్ధి -- వికసిత్ భారత్" లక్ష్య సాధనలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు దేశ సహకార రంగ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# వెంకన్న దర్శనానికి తండోపతండాలుగా భక్తుల కోలాహలం....




**గుడ్లవల్లేరు,జూలై 6 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తండోపతండాలుగా కోలాహలం ఏర్పడింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో జరిగిందని నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు. తొలుత స్వామివారికి విశేషాభిషాకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా క్యూలైనుల్లో అడుగడుగునా తాగునీరు వంటి కనీస వసతుల్ని నిర్వాహకులు బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు ఏర్పాటు చేశారు.

# సూపరింటెండెంట్ నుంచి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా జేకే కృష్ణశ్రీకి పదోన్నతి

● నూతన బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరచాలని ఆర్జేడీ పి. తిమ్మప్ప ఆకాంక్ష



**విజయవాడ,జూలై 6 (వార్తాప్రభ) :** సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జేకే కృష్ణ శ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (పీఆర్వో) గా పదోన్నతి పొందిన సందర్భంగా జోన్-2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) పి. తిమ్మప్ప ఆమెను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సమాచార పౌరసంబంధాల సంచాలకుల కార్యాలయంలో కృష్ణశ్రీ కి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జేడీ పి. తిమ్మప్ప మాట్లాడుతూ.. సూపరింటెండెంట్‌గా ఆమె ఇప్పటివరకు అందించిన సేవలను ప్రశంసించిన ఆర్జేడీ పి. తిమ్మప్ప, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా నూతన బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, సమర్థతతో పనిచేసి శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తన ఉద్యోగ బాధ్యతల్లో సూపరిండెంట్ గా కృష్ణశ్రీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందడం సంతోషకరం. నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను అని ఆర్జేడీ పి. తిమ్మప్ప అన్నారు. అభినందించిన వారిలో సీనియర్ అసిస్టెంట్లు డీవి సుబ్రహ్మణ్యం, ఉమర్ ఫరూక్, జూనియర్ అసిస్టెంట్లు వి. సునీత, రికార్డు అసిస్టెంట్ కృష్ణారావు, ఆఫీసు సబార్డినేట్లు చిన వెంకటేశ్వరరావు, భానుమతి, తదితర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

## శ్రీ విఘ్నేశ్వర గృహ నిర్మాణ కార్మిక సంఘం ప్రారంభం





**మల్కాజిగిరి :జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ విఘ్నేశ్వర గృహ నిర్మాణ కార్మిక సంఘం పునఃప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ హాజరై, కార్మికుల సంక్షేమం కోసం సంఘం చేపట్టే కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఎన్ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఐలయ్య , శ్రీ విఘ్నేశ్వర గృహ నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సత్యనారాయణ , ప్రెసిడెంట్ ఎస్. నరసింహ, వైస్ ప్రెసిడెంట్ శ్రీను , జె. నవీన్, కోమరయ్య, నాగరాజు, కె. శ్రీనివాసులు, మారుతి, రవి ప్రసాద్ తదితర సంఘ నాయకులు, సభ్యులు గృహ నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సంఘం ద్వారా కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి కార్మికునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడం, అలాగే సంఘాన్ని మరింత బలోపేతం చేయడం తమ ప్రధాన లక్ష్యాలని నాయకులు తెలిపారు.కార్యక్రమ లక్ష్యం: గృహ నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని పరిరక్షిస్తూ, వారి సమస్యలకు సమిష్టి పరిష్కారాలు అందించడం, కార్మికుల సమగ్ర అభివృద్ధి సాధ్యమని నాయకులు పిలుపునిచ్చారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**- ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం**



**ఇబ్రహీంపట్నం, జులై 06 (వార్తా ప్రభ ప్రతినిధి):** పోలీస్ స్టేషన్ పరిధిలోని పైదురుపాడు గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, ఓటిపి, కేవైసీ అంటూ ఫోన్లు వస్తే అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అప్‌డేట్ మోసాలు, ఫేక్ లింకులు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, డిజిటల్ అరెస్టు, ఈ-కామర్స్ మోసాలు, ఇన్వెస్ట్‌మెంట్ (పెట్టుబడి) మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు వంటి వివిధ రకాల సైబర్ నేరాల ఎలా అప్రమత్తంగా ఉండాలో వివరించారు.అపరిచిత వ్యక్తులతో బ్యాంకు ఖాతా వివరాలు గోప్యంగా ఉంచాలని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని వెబ్‌సైట్లు లేదా యాప్‌ల ద్వారా కొనుగోళ్లు చేయవద్దని, అధిక లాభాల ఆశ చూపే పెట్టుబడి పథకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాలను నివారించడంలో పోలీసులకు సహకరించాలని ఇబ్రహీంపట్నం పోలీసులు కోరారు.

## ఘనంగా అంగర రంగనాథ్ పుట్టినరోజు వేడుకలు....



**కృత్తివెన్ను జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగర రంగనాథ్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, చినపాండ్రాకా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పెడనలోని అమ్మ ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమంలో మరియు మచిలీపట్నం సహాయ ఫౌండేషన్ లో అంగర రంగనాథ్ పేరు మీద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రంగనాథ్ కార్యాలయం వద్ద కేక్ కటింగ్ చేసి టిడిపి కార్యకర్తలు రంగనాథ్ అభిమానులు మిఠాయిలు పంచుకున్నారు.

## ఎస్ ఐ ఆర్ బి ఎల్ వో ల సమావేశం

**మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి**



**విస్సన్నపేట జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా పలు వార్డులలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి పర్యవేక్షించారు. నూతన ఓట్లు తీసివేతలు తదితర అంశాలపై ప్రత్యక్షంగా ఆమె ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిఎల్ఓ లతో సమావేశమై ప్రతి ఒక్క ఓటర్ ను కలిసి కొత్తగా పెళ్లైన వారి ఓట్లు చేర్చుట అత్తింటి వారి ఇంటికి వెళ్లిన ఆడపడుచుల ఓట్ల బదిలీ తదితర అంశాలపై సమగ్రంగా విధులు నిర్వహించాలి అన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచార నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**కంకిపాడు జూలై 6 (వార్త ప్రభ, ప్రతినిధి)**ప్రేమ పేరిట నమ్మబలికి ఓ మైనర్ బాలికను లొంగదీసుకుని, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసామని డిఎస్పి కే. ధర్మేంద్ర, ఎస్ఐ కే వై దాస్ అన్నారు. పెనమలూరు నియోజకవర్గం,కంకిపాడు మండలం, కంకిపాడు పోలీస్ స్టేషన్లో డిఎస్పి కే ధర్మేంద్ర కంకిపాడు ఎస్ఐ కేవై దాస్ విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ టౌన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాల లో 9వ తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన ఆనంద్ అనే యువకుడు సదరు బాలికను ప్రేమిస్తున్నట్లు నటించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి, జూన్ 16వ తేదీన ఆమెపై లైంగిక దాడికి (అత్యాచారానికి) పాల్పడ్డాడు.గత కొన్ని రోజులుగా బాలిక తీవ్ర మానసిక వేదనకు గురికావడాన్ని గమనించిన ఆమె తల్లి, ప్రేమగా దగ్గరకు తీసుకుని ప్రశ్నించగా బాలిక అసలు విషయం తెలిపింది అన్నారు. ఈ నెల 2వ తేదీన బాలిక తల్లి కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి, నిందితుడు ఆనంద్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు.మైనర్ బాలికలపై జరుగుతున్న నేరాల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.?తల్లిదండ్రుల నిఘా అవసరం: 7, 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థినుల ప్రవర్తనను తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ, చాలా జాగ్రత్తగా కనిపెట్టుకుని ఉండాలని అన్నారు.?ప్రస్తుతం పిల్లల చేతుల్లోకి ఆండ్రాయిడ్ ఫోన్లు రావడం, వారికి ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ వంటి యాప్‌లపై పూర్తి అవగాహన ఉండటంతో, నిందితులు వాటి ద్వారానే పరిచయం పెంచుకుని, మాయమాటలతో ప్రలోభపెట్టి లోబరుచుకుంటున్నారాని తెలిపారు.




తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయడం వల్లే ఇలాంటి ఘోరాలు జరుగుతున్నాయి.?కేవలం తల్లిదండ్రులే కాకుండా, స్కూల్ యాజమాన్యాలు, టీచర్లు కూడా ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి విషయాలపై కౌన్సిలింగ్ ఇవ్వాలి. వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేలా మోటివేట్ చేయాలి.గతంలో ఆస్తి తగాదాలు, కొట్లాటల కేసులు ఎక్కువగా ఉండేవని, కానీ ప్రస్తుతం మైనర్ బాలికలపై అత్యాచారాలు, మోసాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టడానికి సమాజం, తల్లిదండ్రులు, పాఠశాలలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెరుమాళ్ళపాడు శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణానికి భూమిపూజ

- శిల్పకళ, సనాతన సాంప్రదాయాలను ప్రతిబింబించేలా నాగలింగేశ్వర ఆలయ నిర్మాణం... మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- భూమిపూజ లో పాల్గొన్న చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్
- సొంత గ్రామంలో నూతన పురాతన ఆలయ నిర్మాణం చేయడం సంతోషంగా ఉంది.... పి.నరసింహ ప్రసాద్





**చేజర్ల జూలై 06 (వార్తాప్రభ)** చేజర్ల మండల కేంద్రంలోని పెరుమాళ్ళపాడు గ్రామంలో ఆదివారం రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శ్రీ నాగలింగేశ్వరాలయం నిర్మాణ శంఖుస్థాపన చేశారు.గతంలో పెన్నా పరివాహక ప్రాంతంలో ఏటి ఒడ్డున పరశురాముడు హయాంలో ఇక్కడ శ్రీ నాగలింగేశ్వర ఆలయాన్ని నిర్మించాడని పూర్వీకులు చెబుతున్నారు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ఆ ఆలయం పూర్తిగా ఇసుక తుపానుల కారణంగా ఇసుకలో పూడిపోవడం జరిగినది.ఇటీవల కాలంలో పెరుమాళ్ళపాడు గ్రామస్తులు యువకులు అక్కడ ఉన్న దేవాలయం శిఖరం బయటపడటంతో అక్కడ ఆలయం ఉందని తెలుసుకొని జేసిబి ల సాయంతో ఆలయ నమోనాను వెలికి తీయడం జరిగినది.దీనితో రాష్ట్రం మొత్తం ఈ నాగలింగేశ్వర ఆలయం వైపు చూడటం మొదలు పెట్టింది. ఎంతోమంది ప్రముఖులు రాజకీయ నాయకులు దండోపతండాలుగా ఆ పురాతన ఆలయాన్ని వీక్షించడానికి వచ్చేవారు.కొన్ని సినిమాలలో నాగేశ్వర ఆలయానికి సంబంధించిన కొన్ని చిత్ర సన్నివేశాలను కూడా అక్కడ చిత్రీకరించడం జరిగింది.ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ నాగలింగేశ్వర ఆలయాన్ని ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి అధికారులతో పాటు అక్కడికి చేరుకుని శ్రీ నాగలింగేశ్వర ఆలయాన్ని గతంలో సందర్శించడం జరిగినది.ఇదంతా చూసిన ఆయన ఎలాగైనా ఈ పురాతన ప్రసిద్ధి చెందిన ఆలయాన్ని తిరిగి నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి దేవదాయ శాఖ నుండి ఈ పురాతన ఆలయం నిర్మాణం కొరకు అహర్నిశలు కష్టపడి ఆలయ నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకోవడం జరిగినది.దీనిలో భాగంగా ఆదివారం చేజర్ల మండలంలో మరికొన్ని ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయాలు శిథిలావస్థలో ఉన్న వాటిని పునర్నిర్మానం చేసే దిశగా ఆయన నడుం బిగించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ పెరుమాళ్ళపాడు శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయం పునర్నిమానానికి భూమి పూజ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని సుమారు 200 నుండి 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన దైవ క్షేత్రానికి తీసుకురావడానికి మనందరి బాధ్యతగా రూ. 1.5 కోట్ల సిజిఎఫ్ నిధులతో భారతీయుల దేవాలయ శిల్పకళ సనాతన సంప్రదాయాలను ప్రతిబింబించేలా భవ్య ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నామని అన్నారు. అలాగే ప్రాచీన దేవాలయాల సంరక్షణ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తుందని తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తూ భావితరాలకు సాంస్కృతిక వారసత్వాన్ని అందించే దిశగా ఈ ఆలయం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.ఈ క్రమంలోనే ముందుగా శ్రీ నాగలింగేశ్వర ఆలయంతో పాటు చేజర్లలోని చెన్నకేశవ ఆలయం చిత్తలూరు లోని చెన్నకేశవ ఆలయం పునర్నిర్మానం కొరకు శంకుస్థాపనలు చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సంబంధిత అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆ గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొని శంకుస్థాపన నిర్మానోత్సవ కార్యక్రమాలలో భాగస్వాములై భక్తిశ్రద్ధలతో భూమిపూజలు నిర్వహించడం జరిగింది. ముందుగా పెరుమాళ్ళ పాడు గ్రామస్థులు పలసాని ఈశ్వర్ రెడ్డి కుమారుడు చిత్తూరు మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న పలసాని నరసింహ ప్రసాద్ తన సొంత గ్రామం అయిన ఈ పెరుమాళ్ళపాడు లో నూతన శ్రీ నాగలింగేశ్వర ఆలయం భూమి పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేయడం జరిగినది.పురాతన ఆలయాన్ని కొత్త నిర్మాణం చేపట్టేందుకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చొరవ తీసుకుని ఆలయాన్ని నిర్మించడం చాలా సంతోషంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ నాగలింగేశ్వర ఆలయ శంకుస్థాపనలో గ్రామస్తులు కిలారి జయరామయ్య నాయుడు మహేష్ మాదాల జనార్దన్ నాయుడు కమలేష్ గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ఆదర్శ ప్రజానాయకులు మండలి వెంకట కృష్ణారావు.

**సుప్రసిద్ధ సంపాదకులు ఎంవిఆర్. శాస్త్రికి మండలి వెంకట కృష్ణారావు పురస్కారం ప్రదానం**



**చల్లపల్లి : అవనిగడ్డ: జులై 6(వార్తాప్రభ ప్రతినిధి)**ఆదర్శ ప్రజా నాయకులు మండలి వెంకట కృష్ణారావు అని సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు, చరిత్ర పరిశోధకులు ఎంవిఆర్. శాస్త్రి అన్నారు. చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభ, మండలి వెంకట కృష్ణారావు జీవితచరిత్ర ఆధారంగా రూపొందించిన మహాపురుషుడు మండలి నాటక ప్రదర్శన జరిగాయి.ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంవిఆర్. శాస్త్రి మాట్లాడుతూ ఆంధ్ర చరిత్రలో ఎందరో దిగ్గజ నేతలున్నప్పటికీ ఉత్తమమైన, ఆదర్శప్రాయులైన రాజకీయవేత్త మండలి వెంకట కృష్ణారావు ఒక్కరేనని అన్నారు. మంత్రిగా ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన నిరాడంబరత, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ, తెలుగుభాషకు పట్టంకట్టిన వ్యక్తిగా దివిసీమ పునఃనిర్మాతగా కృష్ణారావు చరిత్రలో నిలిచారన్నారు. జై ఆంధ్ర ఉద్యమ సమయంలో భౌతిక దాడులకు తెగబడిన పరిస్థితుల్లోనూ సమైక్యవాదిగా నిలబడిన గొప్ప వ్యక్తి అని కీర్తించారు. మండలి కృష్ణారావు చూపిన తెగువ, ఆత్మస్థయిర్యం స్ఫూర్తిదాయకమని అన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా ఒకేలా ఉండి గాంధేయవాదాన్ని ఆచరణలో చూపిన మహోన్నతులని కొనియాడారు. తెలుగుభాష, సంస్కృతికి కట్టుబడిన మండలి వెంకట కృష్ణారావు హయాం తెలుగుభాషకు స్వర్ణయుగం అనీ, ఆ వారసత్వాన్ని ఆయన కుమారుడు మండలి బుద్ధప్రసాద్ కొనసాగిస్తున్నారని అభినందించారు. తండ్రికి తగ్గ తనయునిగా వాసరత్వాన్ని కొనసాగిస్తూ తెలుగుభాషకు పట్టంకట్టి ముందుకు సాగుతున్నారని తెలిపారు.సభాధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, పత్రికా సంపాదకునిగా విలువలు పెంచి, కలంతో కొరడా ఝులిపించి, ఎవరికీ తలవంచని వ్యక్తి ఎంవిఆర్. శాస్త్రి అన్నారు. సామాన్యుల గళం చట్టసభల్లో వినబడితేనే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందనేందుకు ప్రత్యక్ష ఉదాహరణ మండలి వెంకట కృష్ణారావు అన్నారు. మహాపురుషుడు మండలి నాటకం నాటకరంగంలో కొత్తమలుపు అని అందరూ భావిస్తున్నారనీ, నాటకంలోని సందేశాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందని తెలిపారు. ప్రజల మధ్యన నడిచిన రాజకీయవేత్త జీవిత చరిత్ర రాయటం సంక్లిష్టమనీ, దీర్ఘాసి విజయభాస్కర్ ఎంతో గొప్పగా నాటకం రాస్తే గంగోత్రి సాయి దర్శకత్వంలో అద్భుత ప్రదర్శన ఇస్తున్నట్లు వారిని అభినందించారు.పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సమర్ధవంతమైన వ్యక్తిని నాయకుడిగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలన్నారు.భవిష్యత్ పట్ల అవగాహన, నిజాయితీ, సుస్థిర నాయకత్వం అందించే వారినే ఎన్నుకుంటే సమాజ పురోభివృద్ధి,పారదర్శక పాలన లభిస్తుందన్నారు.కక్షసాదింపు రాజకీయాలు సమాజానికి చేటు చేస్తాయని హితవు పలికారు.ఏ విధమైన ఒత్తిళ్ళకు లొంగకుండా వాస్తవం సమాచారాన్ని అక్షరీకరించడంలో ఎంవిఆర్ శాస్త్రి తనకు తానే సాటి అని కొనియాడారు.మండలి వెంకట కృష్ణారావు నిరాడంబర జీవనం,సమాజ సేవ పట్ల తపన , తెలుగు భాష అభివృద్ధికి నిరంతరం శ్రమించిన తీరు ,ఉన్నత వ్యక్తిత్వం వుంది సంవత్సరాల గడిచినా ప్రజల గుండెల్లో ఆయనను సజీవంగా నిలిపి ఉంచాయన్నారు. విద్యావేత్త బుడ్డిగ జమిందారు, సంగీత విద్వాంసులు బూసరపల్లి వెంకటేశ్వరరావులు ప్రసంగిస్తూ మండలి వెంకట కృష్ణారావు నిరాడంబరత, దివిసీమ గాంధీగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్న బుద్ధప్రసాద్ను అభినందించారు.

**ఎంవిఆర్.శాస్త్రికి మండలి పురస్కారం** ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి పురస్కారాన్ని పత్రికా సంపాదకులు ఎంవిఆర్.శాస్త్రికి అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు సజ్జా రామకోటయ్య - రాజేష్ మెమోరియల్ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, నిర్వాహకులు సజ్జా చలపతిరావు లతో పాటు పలువురు అధికార అనధికార ప్రముఖులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి



**నూజివీడు , జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):**డాక్టర్ బాబు జగజీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నూజివీడు అజరయపేటలోని విగ్రహం వద్ద డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయగిరి కృపారావు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన భారత దేశ తొలి ప్రధానిగా మరియు భారత చరిత్రలొ 30 సంవత్సరాల పాటు కేంద్ర మంత్రిగా పని చేసి రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు., స్వతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్త రాజకీయవేత్త, అణగారిని వర్గాల కోసం నిరంతరం పోరాడి ఎన్నో అవమానాలు పొంది సామాజికతను సాధించారు ఆయన రాజకీయవేత్తగా భారత ఉప ప్రధానిగా అనేక శాఖల మంత్రిగా అయినా అధిరోహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కలపల కృపారావు కౌన్సిలర్లు మలిశెట్టి శరత్ కుమార్ బాబి కల్లేపల్లి ఆదినారాయణ, రాంబాబు, సైమన్ కలపాల రాజు,సీనియర్ నాయకులు సూర్య పామర్తి సాయి, రవితేజ నక్క నారాయణ రాజులపాడు రాంబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## "సమసమాజ స్థాపనే బాబూ జగ్జీవన్ రామ్‌కు నిజమైన నివాళి

**- గొల్ల నరసింహ యాదవ్"**



**తిరుపతి: జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత మాజీ ఉప ప్రధాని, మహానేత బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ తన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ నిర్మాణంలో బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామాజిక విప్లవకారుడిగా అణగారిన వర్గాల అభ్యున్నతికి, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఆయన జీవితాంతం అంకితభావంతో కృషి చేశారని గుర్తుచేశారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా దేశాన్ని ఆహార ధాన్యాల కొరత నుంచి గట్టెక్కించి, హరిత విప్లవానికి బలమైన పునాది వేసిన మహానేతగా బాబూజీ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అలాగే 1971 భారత్--పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా ఆయన ప్రదర్శించిన దూరదృష్టి, వ్యూహాత్మక నాయకత్వం దేశ విజయానికి కీలకంగా నిలిచిందని తెలిపారు.దాదాపు ఐదు దశాబ్దాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా, దేశంలో అత్యంత సుదీర్ఘ కాలం కేంద్ర మంత్రిగా సేవలందించిన గొప్ప నాయకుడిగా బాబూ జగ్జీవన్ రామ్ చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు.అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో అణగారిన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తోందని గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి. వలముని, రామారావు, టి. కృష్ణ, రవి తదితరులు పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కిర్లంపూడిలో భారీగా గంజాయి స్వాధీనం- ఒకరి అరెస్టు






**కిర్లంపూడి జులై 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కాకినాడ జిల్లా కిర్లంపూడి సమీపంలోని ఎన్ హెచ్-16 రహదారిపై పోలీసులు జరిపిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది.ఓ ట్రాక్టర్‌కు ఉన్న వ్యవసాయ యంత్రంలో రహస్యంగా దాచిన 52.7 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో కృష్ణా జిల్లా గన్నవరం మండలానికి చెందిన కూచినపూడి ఫ్రాన్సిస్ (57) అనే నిందితుడిని అరెస్టు చేశారు.స్వాధీనం చేసుకున్న గంజాయి, ట్రాక్టర్, ఇతర వస్తువుల మొత్తం విలువ సుమారు ?23.87 లక్షలు ఉంటుంది.ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందం ఈ మెరుపు దాడిని విజయవంతంగా నిర్వహించింది.నిందితుడిపై ఎన్ డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామని, ముఠాలోని మిగిలిన వారిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.